


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




నూతన సంవత్సర శుభాకాంక్షలు
2025
పాఠకులకు, పాత్రికేయులకు, మార్కెటింగ్ సిబ్బందికి, రిపోర్టర్ సోదరులకు, మిత్రులకు, బంధువులకు, శ్రేయోభిలాషులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు
విశ్వంవాయిస్ తెలుగు దినపత్రిక



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 119 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 8 జనవరి 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# చెన్నైలో చైనా వైరస్

**చైనాలో పురుడుపోసుకున్న మెటాన్యుమో వైరస్ భారత్‌లో క్రమంగా విస్తోరిస్తోంది. కోరలు చాచింది. ఇప్పటికే కర్ణాటక, గుజరాత్‌లల్లో ఈ కేసులు నమోదయ్యాయి. బెంగళూరులో రెండు, అహ్మదాబాద్‌లో ఒక హెచ్‌ఎంపీవీ పాజిటివ్ కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇది మరింత విస్తరించింది. పొరుగు రాష్ట్రానికీ పాకిందీ వైరస్.**

**చెన్నై :** తమిళనాడులో రెండు హెచ్‌ఎంపీవీ కేసులు నమోదయ్యాయి. చెన్నై, సేలంలల్లో ఈ రెండింటినీ గుర్తించారు వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు. సేలం, చెన్నైకి చెందిన ఇద్దరు చిన్న పిల్లలు ఈ వైరస్ బారిన పడ్డారు. ప్రస్తుతం వారిద్దరూ వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నారు. తొలి హెచ్‌ఎంపీవీ కేసు చెన్నైలోని గిండి చెట్‌పేట్‌లో నమోదైంది. ఇక్కడ నివసించే ఓ చిన్నారిలో ఈ వైరస్ లక్షణాలు కనిపించాయి. దగ్గు, జ్వరం, జలుబు, శ్వాస సంబంధిత ఇబ్బందులతో బాధపడుతున్న ఆ చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలను నిర్వహించారు. వాటి శాంపిల్స్‌ను పరిశీలించగా.. హెచ్‌ఎంపీవీగా తేలింది. మరో కేసు- సేలంలో రికార్డయింది. దీనితో తమిళనాడు ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ వైరస్ వల్ల ఎలాంటి అపాయమూ లేదని పేర్కొంది. ఇదేమీ కొత్త వైరస్ కాదని, 2001లోనే

మిగతా 2

## సీఎం చంద్రబాబు అలెర్ట్!



భారతదేశంలోకి ఎంటర్ అయిన చైనా వైరస్ ఇప్పుడు అందరినీ ఆందోళనకు గురి చేస్తుంది. ఇప్పటికే బెంగళూరులో ఇద్దరు చిన్నారులు హెచ్‌ఎంపీవీ వైరస్ బారిన పడినట్టు అధికారికంగా ధృవీకరిం

మిగతా 2



## చంద్రబాబుకు అమరావతి రైతులు బిగ్ షాక్

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని గుంటూరు, విజయవాడకు అనుసంధానం చేస్తూ కొత్తగా నిర్మించే రైల్వే లైను పనులకు కేంద్ర ప్రభుత్వం కొన్నాళ్ల కిందటే పచ్చజెండా ఊపించింది. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ లైను నిర్మిస్తారు. నంబూరు నుంచి గుంటూరువైపు వెళ్లే రైళ్లు, విజయవాడవైపు వెళ్లే రైళ్లు చీలిపోతాయి. నంబూరు రైల్వే జంక్షన్ అవుతుంది. ప్రస్తుతం ఈ స్టేషన్ గుంటూరుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న స్టేషన్. గుంటూరు వెళ్లే అవసరం లేకుండా న్యూ గుంటూరు, తెనాలి, గూడూరు మీదుగా చెన్నై, తిరుపతి కూడా వెళ్లిపోవచ్చు.

**రాజధానికి సమీకరించిన తరహాలో తీసుకోవాలి :** వైకుంఠపురం దగ్గర కృష్ణానది నుంచి నంబూరు వరకు నిర్మించే రైల్వే మార్గానికి సంబంధించి సర్వేను ప్రారంభించారు. దారిలో అడ్డంగా ఉండే విద్యుత్తు లైన్లు తొలగించేందుకు, రైల్వే విద్యుత్తు లైన్లకు సంబంధించి సర్వే జరుగుతోంది. ఎన్టీఆర్

మిగతా 2



## ఫార్ములా ఈ రేస్ కేసుపై రేవంత్ సర్కార్ హడావిడి

**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పైన మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కావాలని కేటీఆర్ ని ఇరికిస్తున్నారని వ్యాఖ్యలు చేసిన ఆయన రేవంత్ రెడ్డి అరెస్టయి జైల్లో పడటానికి కేటీఆర్ పై కేసుకి పొంతనలేదని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిని వదిలిపెట్టబోము: హరీష్ రావు రేవంత్ రెడ్డి డబ్బులు కట్టలతో కెమెరాల ముందు దొరికి జైలుకు వెళ్ళాడని, కేటీఆర్ తెలంగాణ కోసం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసం ఫార్ములా ఈ రేస్ తీసుకువచ్చారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడాన్ని కేటీఆర్ అక్రమ కేసుకి పోల్చడం మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్టుగా అవుతుందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఎన్ని రకాల కేసులు పెట్టినా

మిగతా 2

## కెనడా ప్రధానిగా అనితా ?



**కెనడా :** కెనడా రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. దాదాపు పదేళ్ల పాటు ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడోపై తీవ్ర ఆరోపణలు రావడంతో ఆయన్ను ఎన్నికలకు ముందే తప్పుకోవాలన్న ఒత్తిడి పెరిగిపోయింది. దీంతో ట్రూడో నిన్న తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు కొత్త ప్రధానిని ఎన్నుకునేందుకు లిబరల్ పార్టీ సిద్ధమవుతోంది. ఈ రేసులో భారతీయ మూలాలున్న లాయర్, ప్రస్తుత కేబినెట్ మంత్రి అనితా ఆనంద్ ముందున్నారు. తొమ్మిదేళ్ల పదవీకాలం తర్వాత రాజీనామాకు సిద్ధమైన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో .. తాను పదవీవిరమణ చేస్తానని, అయితే లిబరల్ పార్టీ కొత్త నాయకుడిని ఎన్నుకునే వరకు పదవిలో కొనసాగుతానని తాజాగా ప్రకటించారు. దీంతో కొత్త నాయకుడిని ఎన్నుకునే వరకు ఆయన

మిగతా 2


## కేటీఆర్ ఇంటికి లీగల్ టీమ్



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్**

తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న ఫార్ములా ఇ-కార్ రేస్ అవినీతి వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఈ కేసులో అరెస్ట్‌ను ఎదుర్కొంటోన్నారు మాజీ మంత్రి, భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. క్వాష్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ సారథ్యంలోని సింగిల్ జడ్జి బెంచ్ ఆదేశాలను ఇచ్చింది. దీన్ని కొట్టివేస్తోన్నట్లు తెలిపింది. ఈ క్వాష్ పిటీషన్‌పై ఇదివరకే హైకోర్టులో వాదనలు ముగిసిన విషయం తెలిసిందే. ఇరు పక్షాల నుంచి వాదోపవాదాలను

మిగతా 2




## హిమాలయాల్లో 7.1 తీవ్రతతో భారీ భూకంపం

**నేపాల్ :** నేపాల్‌లో పెను భూకంపం సంభవించింది. హిమాలయాల రీజియన్ పరిధిలోని లొబుచే ప్రాంతం దీనికి కేంద్రబిందువు. దీని తీవ్రత భారత్‌లోనూ కనిపించింది. నేపాల్‌కు ఆనుకుని వుండే పశ్చిమ బెంగాల్, సిక్కిం, బిహార్‌లల్లో పలుచోట్ల ప్రకంపనలు నమోదయ్యాయి. నేపాల్ హిమాలయన్ రీజియన్‌లో తాజాగా సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.1గా రికార్డయింది. భారత కాలమానం ప్రకారం ఈ తెల్లవారుజామున 6:35 నిమిషాలకు భూకంపం సంభవించినట్లు యునైటెడ్ స్టేట్స్ జియాలాజికల్ సర్వే వెల్లడించింది. లొబుచేకు ఈశాన్య దిశగా 93 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాన్ని భూకంప కేంద్రంగా గుర్తించారు. ఉపరితలం నుంచి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దిగువన టెక్టానిక్ ప్లేట్లల్లో చోటు చేసుకున్న పెను కదలికల వల్ల భూమి కంపించినట్లు

మిగతా 2



## ప్రియాంక గాంధీ... బుగ్గల్లా రోడ్లు

### హైదరాబాద్‌లో బీజేపీ ఆఫీస్‌పై కోడిగుడ్లు

**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్**

కాంగ్రెస్ లోక్‌సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రాపై భారతీయ జనతా పార్టీకి చెందిన ఎంపీ రమేశ్ బిధూరి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు రోడ్డెక్కుతున్నారు. బిధూరి దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తోన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేస్తోన్నారు. ప్రియాంక గాంధీపై వ్యక్తిగత విమర్శలు చేశారు రమేష్ బిధూరి. అసభ్యకరంగా మాట్లాడారు. ప్రియాంక గాంధీ వాద్రా

మిగతా 2

## హస్తినాపురిలో అసెంబ్లీ ఎన్నికల రణభేరి

### తేదీ, ఓట్ల లెక్కింపు తేదీలు ఇవే



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్**

ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. అన్ని పార్టీలు ఎన్నికల సమరానికి సమాయాత్తమౌతోన్నాయి. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. కాంగ్రెస్ కూడా సొంతంగా బరిలో దిగిన త్రిముఖ పోటీ ఏర్పడటం ఖాయమౌతుంది. ఊహించినట్టే ఫిబ్రవరి మొదటివారంలో ఈ ఎన్నకలు షెడ్యూల్ అయ్యాయి. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఈ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ మేరకు ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లోని ప్లానెరీ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధుతో కలిసి మాట్లాడారు. ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. అదే నెల 8వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. మొత్తం 70 నియోజకవర్గాలు ఉన్నాయి ఢిల్లీ అసెంబ్లీలో. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన మేజిక్ ఫిగర్.. 36. 2013లో దేశ రాజధానిలో జెండా పాతింది ఆమ్ ఆద్మీ పార్టీ. ఇప్పటివరకూ చెక్కు చెదరట్లేదా పార్టీ ఓటుబ్యాంక్. 1998లో చివరిసారిగా భారతీయ జనతా పార్టీ ఢిల్లీని పాలించింది. 2013లో కాంగ్రెస్

మిగతా 2



## రేప్ కేసులో ఆశారాంకు బిగ్ రిలీఫ్ !

**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :**

లఅత్యాచర కేసులో యావజ్జీవ కారాగారశిక్షను ఎదుర్కొంటోన్న స్వయం ప్రకటిత ఆధ్యాత్మిక వేత్త, బాబా ఆశారాం బాపూనకు బిగ్ రిలీఫ్ లభించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాలను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. 2013 నాటి అత్యాచార కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నారు ఆశారాం బాపు. ఆయన అసలు పేరు అసుమల్ సిరుమలాణి హర్పలాణి. ఆయన వయస్సు ప్రస్తుతం 83 సంవత్సరాలు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో గల ఆశ్రమంలో ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో ప్రధాన

మిగతా 2

## ఆరోగ్యమే మహాభాగ్యం పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం

### ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి సుభాష్

**రామచంద్రపురం విశ్వంవాయిస్ న్యూస్**

సమాజం బాగుండాలంటే అందరికీ సంపూర్ణ ఆరోగ్యం ఉండాలనే స్ఫూర్తితో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకునే దిశగా రాష్ట్ర కార్మిక శాఖ

మిగతా 2



## ఆ తల్లికి సమాధానం చెప్పే ధైర్యం పవన్ కల్యాణ్‌కు ఉందా..?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా వెళ్లారు. అయితే ఈ కార్యక్రమం నుంచి తిరిగి వెళు తూ ఇద్దరు

మిగతా 2

## హద్దు మీరితే.. కఠిన చర్యలు



3

## ఎడిటర్ వాయిస్

# పరిహాసం!

ఒక ప్రాజెక్టు కారణంగా ఎవరు తమ సర్వస్వమూ కోల్పోతున్నారో వారికి తొట్టతొలిగా న్యాయం జరగాలి. పూర్తిస్థాయి పునరావాసం, జీవనోపాధి కల్పించి, ఆ తరువాతనే ప్రాజెక్టు పనిని తలకెత్తుకోవాలి. ఇది అంతర్జాతీయ పునరావాస సూత్రం. చేపడుతున్నది భారీ బహుళార్థక ప్రాజెక్టు అయినప్పుడు, అది పూర్తి కావటానికి ఏళ్లకు ఏళ్లు పడుతున్నప్పుడు, ఆ భారీతనం వల్లనే వందలాది గ్రామాలు ముంపునకు గురై, లక్షలాది మందీ నిర్వాసితులు అవుతున్నప్పుడు- ప్రభుత్వాలు మొట్టమొదటగా దృష్టి పెట్టాల్సింది పునరావాస కల్పన మీదనే! కానీ, మనదేశంలో ఏ ఒక్క ప్రాజెక్టు విషయంలోనూ ఇలాంటి సహజ న్యాయ విధానం అమలు కాలేదు. మన రాష్ట్రంలో వందలాది గిరిజన గ్రామాలను ముంచెత్తే పోలవరం ప్రాజెక్టు లక్షల మంది ఆదివాసీల బతుకులను అస్తవ్యస్తం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పునరావాసానికి అత్యంత అథమ ప్రాధాన్యం ఇస్తున్నందువల్ల %-% త్యాగ జనుల ఇక్కట్లూ, ఇబ్బందులూ ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. కాలువల్లో పారాల్సింది నీళ్లు తప్ప నిర్వాసితుల కన్నీళ్లు కాదన్న ఇంగితం పాలకులకు లేకుండా పోయింది! రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తొలి విడత నిర్వాసితులంటూ 20,946 కుటుంబాలకు నష్టపరిహారం విడుదల చేసింది. పదేళ్ల క్రితం ప్రకటించిన ప్యాకేజీ లెక్కల్లోనే పరిహారం చెల్లించటం అన్యాయం. పోస్టాఫీసు పథకాల్లో డిపాజిట్టు చేసుకున్న సొమ్ము సైతం పదేళ్లలో రెట్టింపునకు పైగా పెరుగుతుంది. 2015లో నిర్ణయించిన రూ.5.86 లక్షల పరిహారాన్నే చెల్లించటం నిర్వాసితులను వంచించటమే అవుతుంది. అత్యంత మానవత్వంతో చేపట్టాల్సిన పరిహార చెల్లింపు ప్రక్రియను పాలకులు పరిహాస స్థాయికి దిగజార్చటం దారుణం. పోలవరం ప్రాజెక్టును ఇప్పటికే 70 శాతానికి పైగా పూర్తి చేశామని, 2027 నాటికి సంపూర్తి చేసి, కాలువల్లో నీళ్లు పారిస్తామని రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఘనంగా చెబుతోంది. తనకు అమరావతి, పోలవరం రెండూ రెండు కళ్ళు వంటివని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిరోజుల్లోనే ప్రాజెక్టును నేరుగా సందర్శించి, శ్వేతపత్రం విడుదల చేసి, వివిధ పనుల దశాదిశలపై సమీక్షించారు. ప్రాజెక్టు పూర్తిపై ఎంతో శ్రద్ధాసక్తి ప్రదర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు కోసం తమ భూమిని, ఊరిని, ఉనికిని, చరిత్రని, చెట్టుని, సంస్కృతిని ఒక్క మాటలో చెప్పాలంటే- తమ సమస్తాన్ని త్యాగం చేస్తున్న నిర్వాసితుల గురించి, వారికి పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించటం గురించి ఒక్క మాటా చెప్పటం లేదు. పోలవరం నిర్మాణానికి తనదే పూర్తి బాధ్యత అని విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర ప్రభుత్వం కూడా పునరావాసం మీద శ్రద్ధ చూపటం లేదు. ఐదేళ్ల పాటు రాష్ట్ర పాలన సాగించిన వైసిపి ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తానని చెప్పింది తప్ప %-% దానిని ఆచరణలో పెట్టలేదు.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

(మొదటిపేజీ తరువాయి)

## చెన్నైలో చైనా వైరస్

కేసు నమోదైందని తెలిపింది. రెస్పిరేటరీ వైరస్ అని, చలికాలంలో జలుబు, ఫ్లూ తరహా లక్షణాలు కనిపిస్తాయని వివరించింది. ప్రత్యేకించి- చిన్నపిల్లలు, వయోధిక వృద్ధులు దీని బారిన పడే అవకాశం ఉందని పేర్కొంది. సరైన ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల నయమౌతుందనీ భరోసా ఇచ్చింది. చెన్నై, సేలంలల్లో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించింది. హెచ్‌ఎంపీవీ వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పలు మార్గదర్శకాలను జారీ చేసిన విషయం తెలిసిందే. దగ్గు, తుమ్ముతున్నప్పుడు నోటికి లేదా ముక్కుకు హ్యాండ్ కర్చీఫ్ లేదా టిష్యూ పేపర్‌ను అడ్డు పెట్టుకోవాలి. సబ్బు లేదా అల్కహాల్‌తో కూడిన శానిటైజర్‌తో తరచూ చేతులను శుభ్రపర్చుకోవాలి. గుంపుగా ఉండే ప్రదేశాలకు వెళ్లకూడదు. అలాంటి ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్లూతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలి. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాలకు వెళ్లకూడదు. గుంపులో తిరగకూడదు. చాలినంత మంచినీళ్లు తీసుకోవాలి. పౌష్టికాహారాన్ని స్వీకరించాలి. అనారోగ్యం బారిన పడినప్పుడు ఇతరులను కలుసుకోవడాన్ని తగ్గించాలి. ఇంట్లోనే ఉండాలి. గాలి ధారాళంగా వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. కంటి నిండా నిద్రపోవాలి. ఇతరులకు షేక్ హ్యాండ్స్ ఇవ్వకూడదు. ఒకసారి వినియోగించిన టిష్యూ పేపర్లు, హ్యాండ్ కర్చీఫ్‌ను మళ్లీ వాడకూడదు. అనారోగ్యంతో బాధపడుతున్న వారితో దూరంగా ఉండాలి. తరచూ కంటిని నలుపుకోవడం, ముక్కు, నోటిని చేత్తో తుడుచుకోవడాన్ని మానుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయకూడదు. డాక్టర్‌ను సంప్రదించకుండా సొంతంగా ఎలాంటి మెడిసిన్‌నూ వాడకూడదు.

## సీఎం చంద్రబాబు అలెర్ట్!

చారు. ఇక తాజాగా గుజరాత్, చెన్నై, సేలం లలో కూడా హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు నమోదయినట్టు తెలుస్తుంది. ఇది చాలా సులభంగా వ్యాప్తి చెందే వైరస్ కావటంతో ఈ వైరస్ వ్యాప్తిపై ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

హెచ్‌ఎంపీవీ వైరస్ ఆందోళన.. చంద్రబాబు సమీక్ష

ఇప్పటికే తెలంగాణా ప్రభుత్వం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని చెప్పింది. ఇక తాజాగా ఏపీలోకి ఎన్డీయే ప్రభుత్వం కూడా హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు దేశంలో నమోదవుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. హెచ్‌ఎంపీవీ వైరస్ పై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**అప్రమత్తంగా ఉన్నాం.. ఆందోళన వద్దు: చంద్రబాబు**

రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలును తీసుకోవాలని వైద్య శాఖాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌ఎంపీవీ వైరస్ పై హెల్త్ డిపార్ట్మెంట్ కు దిశా నిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు బహిరంగ ప్రదేశాలలో మాస్కులు పెట్టుకోవాలని సూచించారు. ఈ వైరస్ పై భయపడాల్సిన అవసరం లేదన్నారు సీఎం చంద్రబాబు.

**వైద్య సదుపాయాల వివరాలు తెలుసుకున్న చంద్రబాబు**

బెంగళూరు, గుజరాత్ ల్లో బయటపడ్డ వైరస్ పై దృష్టి పెట్టిన చంద్రబాబు హెచ్‌ఎంపీవీ వైరస్ యొక్క లక్షణాలు, తీవ్రత, ఎదుర్కోవటానికి శాఖా పరమైన సన్నద్ధతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం అవసరమైన ఔషధాల లభ్యతను తెలుసుకున్నారు. హెచ్‌ఎంపీవీ అనేది సాధారణ కాలానుగుణ వ్యాధి, తేలికపాటి స్వభావం కలదని వైద్యులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. అలా అని నిర్లక్ష్యం చేయదగినది కాదన్నారు.

**వీరు జాగ్రత్తగా ఉండాలి**

2001 నుండి హెచ్‌ఎంపీవీ ప్రబలంగా ఉన్నా, మరణాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీనియర్ వైద్య నిపుణులు తెలిపారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న రోగులు, ఇమ్యునోగ్లోబులిన్‌లపై ఉన్న రోగులు, శిశువులు మరియు దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు తీవ్రత ఎక్కువగా ఉండవచ్చు కాబట్టి, అటువంటి రోగులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెప్తున్నారు.

**వైద్య శాఖాధికారులకు చంద్రబాబు దిశా నిర్దేశం :** అయితే సమీక్షలో చంద్రబాబు హెచ్‌ఎంపీవీ వైరస్ ఏపీలో వ్యాప్తి చెందకుండా, ఒకవేళ ఎంటర్ అయినా కట్టడి ఎలా చెయ్యాలి అన్న దానిపై పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లాలని ఆరోగ్య శాఖాధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో వైద్య శాఖలో ఈ వైరస్ ను ఎదుర్కోవటానికి ఉన్న మౌలిక వసతులపై ఆయన వివరాలు తెలుసుకుని, మరిన్ని వసతులు కల్పించుకోవాలని, మూడునెలల కాలానికి కావాల్సినవి సమకూర్చుకోవాలని సూచించారు.

## రైతులు బిగ్ షాక్

జిల్లాలో అధికారులు భూమిని సేకరించాల్సి ఉంది. దీనికి నోటిఫికేషన్ జారీచేశారు. స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. అమరావతిని నిర్మించేందుకు 29 గ్రామాల పరిధిలో భూ సమీకరణ విధానంలో ఎలా అయితే భూములను తీసుకున్నారో తమ భూములను కూడా అలాగే తీసుకోవాలని అక్కడి రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలో భూసేకరణ జరుగుతోంది. దీనికి ముందు ఇబ్రహీంపట్నంతోపాటు పరిసర గ్రామాల్లో భూసేకరణ జరిగింది.

**కుటుంబ సభ్యులకు ఉద్యోగం కావాలంటున్నారు :** రైల్వేలో తమ కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగాలివ్వాలని కోరుతున్నారు. అలాగే కొన్ని గ్రామాలకు రోడ్లు మరమ్మతులు నిర్వహించడంతోపాటు కొత్త రహదారులు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని అధికారులు రైతులకు హామీ ఇస్తున్నారు. ఈ కొత్త రైలు మార్గం కోసం ఖమ్మం, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 450 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఎర్రుపాలెం వద్ద మొదలయ్యే ఈ రైల్వే మార్గంలో 'పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టిముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరుకు కొత్తగా స్టేషన్లు వస్తాయి. అమరావతి, పెద్దాపురం, కొప్పురావూరు స్టేషన్లు పెద్దవిగా నిర్మిస్తారు. కృష్ణా జిల్లా పరిటాల వద్ద గూడ్స్ రైళ్లు నిలిపే సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తంలో హైలైట్ అంశం ఏమిటంటే.. కొత్తపేట-వడ్డమాను మధ్య కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల మేర వంతెన నిర్మిస్తారు.

## హడావిడి

సరే రేవంత్ రెడ్డిని వదిలిపెట్టబోమని హరీష్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్ పైన కాంగ్రెస్ నేతలది తప్పుడు ప్రచారం కాంగ్రెస్ నేతలు కేటీఆర్ పైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ ను అరెస్టు చేస్తారా? అంటూ నిలదీసిన హరీష్ రావు తాము దేనికైనా సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. ఈరోజు హైకోర్టు ఇచ్చిన తీర్పులో అవినీతి జరిగిందని నిర్ధారించలేదని, ప్రభుత్వం అవినీతి జరిగిందని చెప్పినప్పుడు విచారణ చేసుకోమని మాత్రమే కోర్టు చెప్పిందని ఆయన పేర్కొన్నారు. కోర్టు తీర్పు కాపీ చదివాక తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం గతంలో కూడా కేటీఆర్ విచారణకు సిద్ధమని చెప్పారని గుర్తు చేసిన ఆయన ప్రస్తుతం ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలా అన్న అంశం పైన మా లీగల్ సెల్ నిర్ణయిస్తుందని తెలిపారు. నేటి కేటీఆర్ ఫార్ములా ఈ రేస్ కేసులో వేసిన క్వాష్ పిటిషన్ హైకోర్టు డిస్మిస్ చేసిన నేపథ్యంలో హరీష్ రావు హైకోర్టు తీర్పు పూర్తి కాపీ చదివిన తర్వాత తదుపరి కార్యాచరణ వెల్లడిస్తామన్నారు. అసలు ఫార్ములా ఈ రేస్ లో ఒక రూపాయి కూడా చేతులు మారినప్పుడు అవినీతి ఎట్లా జరుగుతుందని హరీష్ రావు ప్రశ్నించారు. 5 5 కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కారణంగానే కేటీఆర్ పై కేసు పెట్టారని, డైవర్షన్ కోసమే రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి తీవ్రమైన వ్యతిరేకత రావడం వల్ల ప్రజల మైండ్ డైవర్షన్ కోసం ఇప్పుడు ఈ కేసును తెరమీదకి తీసుకువచ్చారని హరీష్ రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆయన తెలిపారు. ఇంతకు పదింతలు తిరిగిస్తాం సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర పాలకులపై చిచ్చరపిడుగుల్లా పోరాడిన చరిత్ర మాదని, ఎన్నో పోరాటాలతో త్యాగాలతో తెలంగాణను సాధించుకున్నామని అటువంటి పోరాటపటిమ తమలో ఉందని హరీష్ రావు తెలిపారు. తప్పకుండా రేవంత్ రెడ్డికి ఇంతకు పదింతలు వడ్డీతో సహా తిరిగి ఇస్తామని హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు.

## కెనడా ప్రధానిగా అనితా ?

ప్రధానమంత్రి, పార్టీ నాయకుడిగా కొనసాగుతారు. ఈ ప్రక్రియకు కొన్ని నెలల సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. కెనడాలో తక్షణ ఎన్నికలు జరగట్లేదు. మార్చి 24 వరకు సస్పెండ్ చేసిన పార్లమెంట్ ఏదైనా విశ్వాస ఓట్లు లేదా ఎన్నికల పిలుపులు జరగడానికి ముందు తప్పనిసరిగా పునఃప్రారంభించాల్సి ఉంది. అలాగే తదుపరి ఎన్నికలు మే కంటే ముందుగా జరగవు. అక్టోబర్‌లో షెడ్యూల్ తేదీగా ఉంటుంది. దీంతో ట్రూడో నాయకత్వంలో ఎన్నికలలో పోటీ చేయకుండా ఉండటానికి నాయకత్వ పోటీని వేగవంతం చేయడం లిబరల్ పార్టీ నేతల లక్ష్యంగా ఉంది. అలాగే ప్రధానిగా భారతీయ మూలాలున్న అనితా ఆనంద్ తో పాటు మెలానీ జోలీ, మార్క్ కార్నీ పోటీ పడుతున్నారు. వాస్తవానికి కెనడాలో ప్రస్తుతం ట్రూడో నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టే అవకాశాలూ లేకపోలేదు. ఈ క్రమంలో గవర్నర్ జనరల్ పాత్ర కీలకం కానుంది. ట్రూడో పార్లమెంట్ విశ్వాసాన్ని కోల్పోతే తప్ప బలవంతంగా తప్పించే అవకాశాలు ఉండవు. గవర్నర్ జనరల్ మేరీ సైమన్ కూడా ఇందులో జోక్యం చేసుకోరు. అయినా నాయకత్వ మార్పులతో సంబంధం లేకుండా లిబరల్ పార్టీ నేతలకు వచ్చే ఎన్నికలు కఠినంగా మారబోతున్నాయి. ఈ క్రమంలో భారతీయ మూలాలున్న అనితా ఆనంద్ పేరు తెరపైకి వస్తోంది. ఓక్‌విల్లే పార్లమెంటు సభ్యురాలు అయిన అనితా ఆనంద్ లిబరల్ పార్టీలో కీలక నేత. ప్రస్తుతం ఆమె రవాణా, అంతర్గత వాణిజ్య మంత్రిగా కూడా ఉన్నారు. గతంలో రక్షణ మంత్రిగా కూడా పనిచేశారు. అక్కడ ఆమె లైంగిక దుష్ప్రవర్తనను ఎదుర్కోవడానికి, కెనడియన్ సాయుధ దళాలలో సాంస్కృతిక సంస్కరణలను ప్రోత్సహించడానికి జరిగిన ప్రయత్నాలకు నాయకత్వం వహించారు. గతేడాది ట్రెజరీ బోర్డు అధ్యక్షురాలిగా పనిచేస్తూనే రవాణా మంత్రిగా నియమితులయ్యారు. ఆమె తల్లితండ్రులు ఇద్దరూ భారతీయులే. గ్రామీణ నోవా స్కోటియాలో పుట్టి పెరిగిన ఆనంద్ కెనడియన్ రాజకీయాల్లో కీలక వ్యక్తిగా మారారు మరియు ట్రూడో తర్వాత లిబరల్ పార్టీ నాయకుడిగా ఎంపికయ్యే ప్రముఖ పోటీదారుల్లో ఒకరిగా పరిగణించబడ్డారు.

## కేటీఆర్ ఇంటికి లీగల్ టీమ్

ఆలకించింది ఉన్నత న్యాయస్థానం. తీర్పును రిజర్వ్ చేసింది హైకోర్టు. ఈ ఉదయం తుది ఉత్తర్వులు ఇచ్చింది. ఫార్ములా ఈ- రేస్ నిర్వాహకులకు ఎవరి అనుమతులు లేకుండా 46 కోట్ల రూపాయలను పౌండ్ల రూపంలో హెచ్‌ఎండీఏ చెల్లించిందని అదనపు అడ్వొకేట్ జనరల్ వివరించారు. నిబంధనల మేరకు 10 కోట్ల రూపాయలకు మించి జరిగే లావాదేవీలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతులను తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. హెచ్‌ఎండీఏ మున్సిపల్ మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తుందని, ఆ శాఖ మంత్రిగా ఈ చెల్లింపులకు కేటీఆర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే- అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిగా వ్యవహరించిన అర్వింద్ కుమార్‌పైనా కేసు నమోదైందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సిద్ధార్థ్ దవే తన వాదనలను వినిపించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేటీఆర్ ఎక్కడా లబ్ధి పొందలేదని అన్నారు. అవినీతి జరిగినట్లు ఏసీబీ ఎక్కడే గానీ ఆధారాలను చూపించలేకపోయిందని చెప్పారు. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని న్యాయస్థానానికి అభ్యర్థించారు. వాదోపవాదాలను విన్న అనంతరం హైకోర్టు తీర్పు ఈ క్వాష్ పిటీషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్ నందినగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. తన లీగల్ టీమ్‌తో భేటీ అయ్యారు. సిద్ధార్థ్ దవే సహా కొందరు న్యాయ నిపుణుల సలహాలను స్వీకరిస్తోన్నట్లు సమాచారం. అందుబాటులో ఉన్న కొందరు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేటీఆర్ నివాసానికి చేరుకున్నారు. లీగల్ టీమ్‌తో పూర్తిస్థాయిలో సంప్రదింపులు నిర్వహించారు. క్వాష్ పిటీషన్‌పై సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పుపై ఎలా ముందుకు వెళ్లాలనే విషయాలపై చర్చించారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేయాలా? వద్దా? స్టే లభించే అవకాశం ఎంతవరకు ఉంది? అనే అంశంపై సమాలోచనలు జరిపారు. సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే వాదనలు ఎలా ఉండాలనే విషయంపై చర్చించారు. ఏసీబీ దాఖలు చేసిన కేసులు తనకు వర్తిస్తాయా? లేదా? ఈ- ఫార్ములా కారు రేసుల చెల్లింపుల్లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రిగా తన ప్రమేయం ఎంతవరకు ఉంది?.. అనే అంశాలపై కేటీఆర్ తన లీగల్ టీమ్‌తో చర్చించినట్లు చెబుతున్నారు.

## హిమాలయాల్లో 7.1 తీవ్రతతో

యూఎస్‌జీఎస్ వెల్లడించింది. లొబుచే రీజియన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భూకంప ప్రభావం కనిపించింది. కొన్ని చోట్ల భవనాలకు బీటలు వారినట్లు ప్రాథమికంగా అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తోన్న ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఉన్నపళంగా ఇళ్లల్లో నుంచి బయటికి పరుగులు తీశారు. రోడ్ల మీదే గడుపుతున్నారు. ప్రధాన భూకంపం తరువాత తక్కువ స్థాయిలో ప్రకంపనలు సంభవిస్తోండటంతో ఇళ్లల్లోకి వెళ్లడానికి భయపడ్డారు. చలిలోనూ ఆరుబయటే ఉంటోన్నారు. ప్రాణనష్టం సంభవించిందా? లేదా? అనేది ఇప్పటివరకు తెలియరాలేదు. ఈ భూకంప తీవ్రత అటు మనదేశంలోనూ కనిపించింది. నేపాల్, హిమాలయన్ రీజియన్‌కు ఆనుకుని ఉండే పశ్చిమ బెంగాల్ ఉత్తర ప్రాంత జిల్లాలు, సిక్కిం, బిహార్‌లల్లో పలుచోట్ల ప్రకంపనలు నమోదయ్యాయి. భారత్- నేపాల్ సరిహద్దుల్లో ఉండే పలు ప్రాంతాల్లో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో నివసిస్తోన్న ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఉన్నపళంగా ఇళ్లల్లో నుంచి బయటికి పరుగులు తీశారు. రోడ్ల మీదే గడుపుతున్నారు. ప్రధాన భూకంపం తరువాత తక్కువ స్థాయిలో ప్రకంపనలు సంభవిస్తోండటంతో ఇళ్లల్లోకి వెళ్లడానికి భయపడ్డారు. చలిలోనూ ఆరుబయటే ఉంటోన్నారు. ప్రాణనష్టం సంభవించిందా? లేదా? అనేది ఇప్పటివరకు తెలియరాలేదు.

## ఎన్నికల రణభేరీ

ఇక్కడ అధికారాన్ని కోల్పోయింది. అప్పటి నుంచీ ఈ రెండు పార్టీలను కాదని ఆమ్ ఆద్మీకే పట్టం కడుతూ వస్తోన్నారు ఢిల్లీ ఓటర్లు. భారీ మెజారిటీతో ఆప్ అభ్యర్థులను గెలిపిస్తూ వస్తోన్నారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్‌కు ఏ మాత్రం కొరుకుడు పడట్లేదు హస్తినాపురి. ఈ సారి ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలతో ఉన్నాయి ఈ రెండు పార్టీలు. ఈ ఎన్నికల బరిలో దిగే అభ్యర్థుల జాబితాలనూ ఆయా పార్టీలు ఇప్పటికే వెల్లడించాయి కూడా. దశలవారీగా ఈ ప్రక్రియను కొనసాగిస్తోన్నాయి. బీజేపీ ఇటీవలే తొలి జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే.

## బిగ్ రిలీఫ్ !

నిందితుడు. ఈ అత్యాచార కేసులో నిందితుడిగా రుజువు కావడంతో 2018లో జోధ్‌పూర్ న్యాయస్థానం ఆయనకు యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. మరో ఇద్దరు అనుచరులకు 20 సంవత్సరాల పాటు జైలుశిక్ష పడిందప్పట్లో. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఓ మహిళపైనా అత్యాచారానికి పాల్పడ్డారనే ఆరోపణలు కూడా రుజువు అయ్యాయి. ప్రస్తుతం ఆయన జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో యావజ్జీవ కారాగార శిక్షను అనుభవిస్తోన్నారు. కిందటి నెలలో 17 రోజుల పాటు పెరొల్‌పై విడుదల అయ్యారు. పెరొల్ గడువు ముగియడంతో జనవరి 1వ తేదీన మళ్లీ జైలు అధికారులకు సరెండర్ అయ్యారు. ఇక తాజాగా ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు అయింది. వృద్ధాప్యం మీద పడటం, దాని వల్ల అనారోగ్యానికి గురి కావడం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని బెయిల్ మంజూరు చేయాలంటూ ఆశారాం బాపు తరఫు న్యాయవాది సుప్రీంకోర్టులో వాదనలను వినిపించారు. వాదనలను విన్న అనంతరం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేష్ బిందల్‌తో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఈ బెయిల్ గడువు మార్చి 31వ తేదీ వరకు ఉంటుంది. బెయిల్‌పై ఉన్న సమయంలో తన అనుచరులను గానీ, ప్రతినిధులను గానీ కలుసుకోకూడదని సుప్రీంకోర్టు షరతులు విధించింది. పోలీసుల సమక్షంలో వైద్య చికిత్సను తీసుకోవాలని, ఫలానా ఆసుపత్రిలోనే ట్రీట్‌మెంట్ తీసుకుంటానంటూ కండిషన్ పెట్టకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం

మంత్రి వాసంశెట్టి సుభాష్ వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఒక ప్రక్క నియోజకవర్గం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తూ, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, మరో ప్రక్క సామాజిక సేవ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు పట్ల తనకున్న ఔదార్యాన్ని చాటుకుంటూనే తన వ్యక్తిగత నిధులను సైతం హెచ్చిస్తూ, ఎవరికి కష్టం వచ్చినా నేనున్నానంటూ ఆర్థిక సహాయం చేస్తూ, ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితంలో ఆనంద వెలుగులు నింపుతున్న రామచంద్రపురం ఎమ్మెల్యే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. అయితే తనను గెలిపించిన రామచంద్రపురం నియోజకవర్గం ప్రజలు ఆరోగ్యవంతులై, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలనే మహోన్నత లక్ష్యంతో 'ఆరోగ్యమే మహాభాగ్యం పైలట్ ప్రాజెక్టు' కు శ్రీకారం చుట్టారు మంత్రి సుభాష్. పైలెట్ ప్రాజెక్టు వివరాలను మంత్రి సుభాష్ మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలో హెల్దీ హార్ట్ మిషన్ ద్వారా హార్ట్ ఎటాక్ లు నియంత్రించేందుకు కార్యచరణ రూపొందించామని, ఈ బృహత్తర కార్యక్రమానికి, ప్రముఖ వైద్యులు కోట. సతీష్ తో పాటు, సిఎస్ఆర్ నిధులను ఇచ్చేందుకు ఒక ప్రైవేటు కంపెనీ సహకారం తీసుకుంటున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లే ఆలోచనలో భాగంగా నియోజకవర్గంలో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, ఆరోగ్యం పట్ల వారిలో చైతన్యం, అవగాహన కలిపించే విదంగా అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నేటి ఆధునిక జీవనశైలి, మానసిక ఆందోళన, ఒత్తిడి, మద్యం, ధూమపానం తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కువగా పురుషులు హృదయ సంబంధ వ్యాధులతోనూ, మహిళలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని, ఈ వ్యాధులను గుర్తించేందుకు అవసరమైన స్క్రీనింగ్ టెస్ట్ లు అతి తక్కువ నామమాత్రపు రుసుముతో నిర్వహిస్తామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వ్యక్తిగత నిధులను కూడా కేటాయిస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. రామచంద్రపురంలో రక్తనిధి, అనాథ ఆశ్రయాలు ఏర్పాటుచేసి ఆదుకుంటామన్నారు. ప్రముఖ వైద్యులు కోట సతీష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గ ప్రజలకు మేలు చేయాలని సదుద్దేశంతో మంత్రి సుభాష్ హెల్దీ హార్ట్ మిషన్ కు ముందుకు రావడం గర్వకారణం అన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా బిపి, షుగర్, కొలెస్ట్రాల్, 2డి ఎకో, టిఎంటి, క్రియాటినిన్ వంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. తొలు త వ్యాధిపై అవగాహన కలిగి ఉండడం, వ్యాధిని గుర్తించడం, వైద్యం అందేలా చేయడం, అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి 90 నిమిషాల్లో వైద్యం అందేలా చూస్తే మరణాల రేటును తగ్గించవచ్చునని అన్నారు. నూటికి 20% మందికే ఆధునిక వైద్యం అందుతుందని, మిగిలిన 80 శాతం ప్రజలకు వైద్య సహాయం అందించడమే మా కర్తవ్యం అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే ఆకాంక్షతో ప్రజలకు మేలు చేయాలనే తపనతో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తీసుకున్న నిర్ణయాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి సుభాష్ ఆశయాలు సిద్ధించి కోరికలు సాకారం అవ్వాలని మనమూ కోరుకుందాం అన్నారు.

## పవన్ కల్యాణ్‌కు ఉందా..?

అభిమానులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పవన్ కల్యాణ్ ఈ ఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సాయం ప్రకటించారు. కాకినాడ-రాజమహేంద్రవరం మధ్య ఉన్న ఏడీబీ రోడ్డులో ఈ ఘటన చోటు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఆ ఇద్దరు మరణించారని పవన్ ఆరోపించారు. పవన్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియాలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆమె పలు ప్రశ్నలు సంధించారు. కన్న బిడ్డను కోల్పోయిన ఈ తల్లి ఆవేదనతో అడుగుతున్నారు. పవన్ కల్యాణ్ ప్రతి మాటకి సూటిగా సమాధానం చెప్పే ధైర్యం ఉందా? అధికారమదంతో కాకుండా మానవత్వంతో మాట్లాడండంటూ పవన్ కల్యాణ్‌ను రోజా నిలదీశారు."సేవ్ ఏపీ" అనే హ్యాష్ ట్యాగ్‌ను తన పోస్టుకు రోజా జత చేశారు. ఇదిలా ఉంటే ..మరణించిన అభిమానుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వెళ్లొవద్దని చెప్పినా, తమ మాట వినకుండా వెళ్లి ప్రాణాలు కోల్పోయారని తల్లిదండ్రులు వాపోతున్నారు. మరోవైపు కోట్లలో రెమ్యునరేషన్ తీసుకునే హీరో, అభిమానులు చనిపోతే మాత్రం రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వారి ప్రాణాల విలువ కేవలం రూ.5 లక్షలేనా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీరును వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల తప్పుపట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నీతులు చెప్పడం వరకేనని, ఆచరణ ఉండదని విమర్శించారు. గేమ్ ఛేంజర్ మెగా ఈవెంట్‌కు హాజరైన ఇద్దరు అభిమానులు రోడ్డు ప్రమాదంలో చనిపోతే ఈ ఘటనను రాజకీయం చేస్తూ నెపాన్ని గత ప్రభుత్వంపై నెట్టేసి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నారని శ్యామల ఎద్దేవా చేశారు. కాకినాడ-రాజమహేంద్రవరం మధ్య ఉన్న ఏడీబీ రోడ్డు ఛిద్రమైందని మీకు ముందుగానే తెలిసినప్పుడు ఈవెంట్‌కి మీరు పర్మిషన్ ఎందుకు ఇచ్చారు సర్ %ాజు×గజు ుుజు =ాూాణ%... అనాలి కదా? అంటూ ఆమె పవన్ కల్యాణ్‌కు కౌంటరిచ్చారు. సినిమాలకు రండి, చొక్కాలు చించుకోండి, బైక్ రేసింగులు చేయండి, ఈలలు వేసి గోల చేయండి అంటూ యువతను రెచ్చగొడుతూ మీరు మాట్లాడిన మాటలు ఒక డిప్యూటీ సీఎం స్థాయిలో ఉండి మాట్లాడాల్సిన మాటలేనా అని ఆమె పవన్‌ను ప్రశ్నించారు. మీ కారణంగా ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోతే కనీసం వెళ్లి పరామర్శించారా?... అంటే, మీ స్వార్థానికి అమాయకుల ప్రాణాలు బలి చేస్తున్నారా?" అంటూ శ్యామల తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## బుగ్గల్లా రోడ్లు

బుగ్గల్లా నునుపుగా ఉండేలా రోడ్లను వేస్తామంటూ హామీ ఇచ్చారు. ఢిల్లీలో కొత్తగా సంగం విహార్, కల్కాజీ, సుధార్ క్యాంప్, ఓఖ్లా వంటి ప్రాంతాల్లో అవుటర్, ఇన్నర్ రోడ్లను వేస్తామని అన్నారు. గతంలో రోడ్లను లాలూ ప్రసాద్ యాదవ్ హేమామాలిని బుగ్గలతో పోల్చారని గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యల పట్ల దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తోన్నారు. ఇందులో భాగంగా- ఈ ఉదయం హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ బీజేపీ కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలను చేపట్టారు. కార్యాలయంపైకి కోడిగుడ్లు విసిరారు. అక్కడే బైఠాయించారు. రమేష్ బిధూరి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దీనితో ఉద్రిక్తత నెలకొంది. మొజాంజాహి మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి బీజేపీ కార్యాలయం వైపు బయలుదేరిన యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. మరి కొందరు వేరే మార్గం గుండా బీజేపీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న కోడిగుడ్లను పార్టీ కార్యాలయంపైకి విసిరారు. దీనతో బీజేపీ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలతో వాగ్వివాదానికి దిగారు. ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో బీజేపీ కార్యకర్తల్లో ఒకరి తలకు గాయాలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం/ జనవరి/8/2025

3

www.viswamvoice.com




### డిప్యూటీ సిఎం పర్యటన

## ప్రాంతాల పరిశీలన

### పర్యవేక్షణలో కలెక్టర్ షాన్‌మోహన్

**పిఠాపురం, గొల్లప్రోలు, విశ్వంవాయిస్ న్యూస్ :** ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్‌ఎ కొణిదల పవన్‌కళ్యాణ్ పర్యటించే ప్రాంతాలను కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మంగళవారం పరిశీలించారు. పిఠాపురం మండలంలోని మల్లం గ్రామంలోని గోకులం, విరవాడ, పట్టణంలోని ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల, పురపాలక ఉన్నత పాఠశాల మైదానం, కుమార పురం గోకులాలను పరిశీలించారు. ఈ పర్యటనలో జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డిపిఒ వి.రవి కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు జడ్‌పి ప్రాథమిక ప్రభుత్వ కళాశాల ప్రాంగణాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న రెవెన్యూ కార్యాలయాన్ని, అర్బన్ హెల్త్ సెంటర్, తాడిపత్రిలోని బోరువెల్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కెవి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.స్వప్న. మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, డిఇ గంగరాజు, ఎఇ సురేంద్ర, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంప్రదాయాలను గౌరవించాలి

### సంక్రాంతి వేడుకల్లో సిఐ కృష్ణ భగవాన్



**సామర్లకోట, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతివారు గౌరవించి ప్రాధాన్యత నివ్వాలని సామర్లకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ కృష్ణ భగవాన్ పిలుపు నిచ్చారు. సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ లో మంగళవారం హెడ్మాస్టర్ తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. తొలుత విద్యార్థులకు రంగ వల్లుల పోటీలను సిఐ కృష్ణ భగవాన్, మున్సిపల్ కమిషనర్. ఏ శ్రీ విద్య, వార్డు కౌన్సిలర్ బలుసు వాసులు ప్రారంభించారు. చక్కటి సృజనాత్మకతతో విద్యార్థుల రంగోలిలతో ఆకట్టుకున్నారు. అనంతరం భోగి మంటను సర్కిల్ ఇన్స్పెక్టర్ భగవాన్ వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కలిగి సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సిఐ సూచించారు. అనంతరం రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, తెదేపా క్రీడా విభాగ కన్వీనర్ నిమ్మకాయల కిరణ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### భూ రీ సర్వే పైలట్ ప్రాజెక్టును

# విజయవంతం చేద్దాం

### శంఖవరం మండలం డిప్యూటీ తాహసిల్దార్





**శంఖవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భూముల రీ సర్వే పైలట్ ప్రాజెక్టును విజయవంతం చేద్దామని శంఖవరం మండల డిప్యూటీ తాహసిల్దార్ కిరణ్ కుమార్ పిలుపును ఇచ్చారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరం పంచాయతీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే పైలట్ ప్రాజెక్టు అవగాహన సదస్సు గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమ ప్రధాన అధికారిగా కిరణ్ కుమార్ సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. శంఖవరం మండలంలో 32 గ్రామాలు ఉన్నాయి. వీటిలో గతంలో 26 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయింది అన్నారు. ఇంకా శంఖవరం, మండపం, అమ్మిరేకుల, అనుమర్తి, ఆవెల్తి, ఓంద్రేగుల... ఈ ఆరు గ్రామాల్లో అసలు రీ సర్వే ప్రారంభమే కాలేదని వెల్లడించారు. దీంతో ఈ ఆరు గ్రామాల్లో కూడా రీ సర్వే పూర్తి చేయాలని, ఈ రీ సర్వే గురించి ప్రజలకు చెప్పాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో త్వరలోనే గ్రామాల్లోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రీ సర్వేను త్వరలోనే ప్రారంభిస్తాం అన్నారు. ఐతే ఈ భూముల రీ సర్వే పైలట్ ప్రాజెక్టులో తొలుత ఒక్క శంఖవరంలోనే ఈ రీసర్వేను ఈ నెల 20 న ప్రారంభిస్తాం. ఇలా ప్రారంభించే ముందు రైతులు అందరికీ ముందస్తు సమాచార లేఖలను అందిస్తాం. ఆ ప్రకారంగా మీ భూముల వివరాల పట్టాదార్ పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్స్, ఇతరత్రా ఆధారాలు ఏవి ఉంటే వాటితో మీ భూముల వద్దకు వచ్చి భూముల కొలతల్లో రెవిన్యూ అధికారులు, సర్వేయర్లకు పూర్తిగా సహకరించండి. మీ భూముల సరిహద్దుల స్థిరీకరణకు, భూ తగాదాల పరిష్కారానికి మీ వంతు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడానికి, ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడానికి ప్రతీ ఒక్క రైతూ కూడా కృషి చేయాలని ఆయన పిలుపును ఇచ్చారు. ఐతే మన దేశంలో స్వాతంత్రానికి పూర్వమే 1900 -1920 మధ్య బ్రిటీష్ హయాంలో భూములను తొలి సర్వే చేసి రీసర్వే సెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్) రూపొందించారు. తర్వాత భూముల క్రయ విక్రయాలు, వారసత్వ మార్పులు లక్షల సంఖ్యలో జరిగినా సరిగా నమోదు కాలేదు. కొందరు రికార్డులను ట్యాంపరింగ్ కూడా చేశారు. వాస్తవానికి ప్రతీ పదేళ్ళకూ ఒకసారి భూముల రీ సర్వే చేయాల్సి ఉంది. కానీ తొలి సర్వే నుంచి ఇప్పటి వరకు ఒక్క సారిగా పూర్తిగా రీ సర్వే జరగనందున తప్పుల తడకలుగా ఉన్న భూ దస్త్రాల ప్రక్షాళన, స్వచ్ఛీకరణ, భూముల సరిహద్దు వివాదాల పరిష్కారానికి రీసర్వే తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని భావిస్తున్న తాజా ప్రభుత్వం ఈ రీ సర్వేను తొలిదశలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోందన్నారు. ఈ రీ సర్వే పైలట్ ప్రాజెక్టులు విజయవంతం ఫలితాలు ఆధారంగా మిగతా అన్ని చోట్లా ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. శంఖవరం గ్రామంలో మెరక, పల్లం కలిపి 2,300 భూమి ఉందని, పూర్వం 1923 లో రీ సర్వే జరిగిందని, ఆ తర్వాత ఇప్పటి వరకు సర్వే జరగలేదని, ఇప్పుడు జరుగు తున్నదని, ఇది నాలుగు దశల్లో జరుగు తుందని సచివాలయం 1 సర్వేయరు వీర్ల సురేష్ వెల్లడించారు. మండల సర్వేయరు దాలి రాజు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు తిరుమలనీడి సీతారాం, కె.వీరలక్ష్మి, సుభాషిణి, గ్రామ సర్వేయర్ బి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



### యాక్సెంచర్ ప్రాంగణ ఎంపికలలో

# ఆదిత్య విద్యార్థుల విజయ కేతనం

### ఉద్యోగం సాధించిన 141మంది ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** మంగళవారం స్థానిక లక్ష్మీనారాయణనగర్,కాకినాడ. బెంగళూరుకు చెందిన ప్రముఖ సి.ఎమ్.ఎమ్. లెవల్-5 సాఫ్ట్వేర్ కంపెనీ యాక్సెంచర్ సంస్థ యాజమాన్యం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉద్యోగాలకు ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన 141 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు తెలియజేశారు.డిగ్రీ అర్హతతో ఉద్యోగాలకు ఎంపికైన 141 మంది విద్యార్థులకు 3.5 లక్షలరూపాయల వార్షిక వేతనం లభిస్తుందని కంపెనీ హెచ్.ఆర్. ప్రతినిధులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ, పీ.జి కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి మాట్లాడుతూ కంపెనీ ఏదైనా ఉద్యోగ సాధనలో ఆదిత్య విద్యార్థులు ముందుంటారని, డిగ్రీ ప్రథమ సంవత్సరం నుండి విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్, సాఫ్ట్ స్కిల్స్ లలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, డిగ్రీ కళాశాలల చరిత్రలో ఎక్కడా లేని విధంగా విద్యార్థులకు మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించడం కేవలం ఆదిత్య కే సాధ్యమని అన్నారు. 'ఉద్యోగం కావాలంటే ఆదిత్య' అనే విద్యార్థుల,తల్లిదండ్రుల కలను నెరవేరుస్తూ ఆదిత్య డిగ్రీ కళాశాలలు ముందుకు సాగుతున్నాయని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అన్నారు.ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన 141 మంది విద్యార్థులను, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్ సుగుణారెడ్డి ,అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, ప్రిన్సిపాల్స్ కె కరుణ, డి బ్యూలా, ఎండి షాహిద్దిన్, సిహెచ్ ఫణి కుమార్, షేక్ రెహమాన్, డి రామకృష్ణ ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్స్ వి.ఎస్.ఎన్. కుమార్, కిషోర్ తదితర అధ్యాపకులు అభినందించారు.

### మోదీ పర్యటన

## విజయవంతం చెయ్యండి

### చోడవరం కూటమి నాయకులతో ఎమ్మెల్యే వేగుళ్ళ సమావేశం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ :** నేడు ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుకు చోడవరం నియోజకవర్గం ఇన్ ఛార్జ్ భాద్యతలు అప్పగించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మంగళవారం చోడవరం నియోజకవర్గంలో కూటమి నాయకులు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. చోడవరం నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో మోదీ సభకు కూటమి కార్యకర్తలు హాజరుకావాలన్నారు. దానికి సంబంధించి అక్కడి నాయకులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే కలిదిండి సూర్యనాగ సన్యాసిరాజు, కూటమి నాయకులు,తదితర్లు పాల్గొన్నారు.

### హెచ్‌ఎంపీవీ వైరస్‌పై

## ఆందోళన అవసరం లేదు

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన
### ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హెచ్‌ఎంపీవీ వైరస్ పై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ నేపథ్యంలో మంగళవారం ఆయన రాజమండ్రి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ లు పెట్టుకోవాలని సూచించారు. హెచ్‌ఎంపీవీ అనేది సాధారణ కాలానుగుణ వ్యాధి, తేలికపాటి స్వభావం కలది.. ఈ వైరస్ పై భయపడాల్సిన అవసరం లేదని.. 2001 నుండి ఉన్నా అంత ప్రమాదకరమైనది కాదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇది ఒక నిర్దిష్ట కాలపు (సీజనల్) వైరస్ కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వైరస్ ప్రభావితుల పరీక్ష కోసం, హెచ్‌ఎంపివి వైరస్‌ని పరీక్షించడానికి 3000 టెస్టింగ్ కెపాసిటీ కిట్‌లను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. ఏ మాత్రం అనారోగ్యంగా ఉన్నా, జలుబు చేసినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వైరస్ నేపథ్యంలో ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేసినట్టు తెలిపారు. ఆక్సిజన్, వెంటిలేటర్లను సిద్ధంగా ఉంచినట్టు వివరించారు. ఓపి ప్రాంతాలలో ఆటో శానిటైజర్ డిస్పెన్సర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతరాయం లేని ఆక్సిజన్ సరఫరా, ఆక్సిజన్ పైపు లైన్లు, లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా, పిఎస్‌ఎ ప్లాంట్ అన్ని సిద్ధం చేసినట్టు వివరించారు. ఈ మేరకు అన్ని లభ్యత వంటి అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించినట్టు తెలిపారు. కాగా ప్రతి ఒక్కరూ తప్పని సరిగా మాస్క్ ధరించాలని, సబ్బుతో 20 సెకన్ల పాటు హ్యాండ్ వాష్ చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు.కూటమి నాయకులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

## 53వ రోజుకు కార్మికుల ఆందోళన

### 53వ రోజుకు చేరిన ఆందోళన



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని చిన్నిం పేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన ఆందోళన మంగళవారం నాటికి 53వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత 53 రోజులుగా కార్మికులు ఆకలితో అలమటిస్తూ అనేక రూపాల్లో తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కానీ ప్రజాప్రతినిధుల్లో కాని, ప్రభుత్వం నుంచి కానీ ఏమాత్రం స్పందన రాకపోవడం బాధాకరమని అన్నారు.కార్మిక సమస్యలను పరిష్కరించలేమని యాజమాన్యం మొండికేయడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం కల్పించుకుని ఫ్యాక్టరీని తెరిపించి 409 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. అప్పటి వరకూ తమ ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి.ఆది, ఎం.కాంతారావు, రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, పాపారత్నం, చంటి, వరలక్ష్మి పాల్గొన్నారు.





### హద్దు మీరితే..

# కఠిన చర్యలు

### సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరపవద్దు

### జిల్లా యస్ పి బి. కృష్ణారావు

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ప్రజలు అందరు సంక్రాంతి పండుగను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు ఇవ్వకుండ సంస్కృతి, సాంప్రదాయ బద్దంగా ఆహ్లాదకరమైన వాతావణం లొ పండుగ జరుపు కోవాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు బి కృష్ణారావు, ఐ పి ఎస్ కోరడమైనది. కోడిపందాలు, పేకాట మరియు గుండాట ఆడుటనిర్వహించుట పాల్గొనుట చట్టరీత్యా నేరం. కావున అట్లు చేసిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. జిల్లాలోని రైతులు గాని మరే ఇతర భూ యజమానులు గాని వారి యొక్క స్థలములలో కోడిపందాలు గాని, గుండాట, పేకాట, రికార్డింగ్ డాన్స్, అశ్లీల నృత్యాలు మరే ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించుటకు అనుమతించరాదు. అలా అనుమతించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కోడి కత్తులు కట్టేవారిపైనా, పందాలు నిర్వహించే వారిపైన మరియు గుండాట నిర్వాహకుల పైన చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. బైండోవర్ చేయబడిన వారు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టప్రకారం మరింత కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మీ ప్రాంతంలో లేదా గ్రామములో కోడిపందాలు, గుండాట, పేకాట, స్థలాలు/పొలాలు, కత్తులు కట్టేవాళ్ళు, పందెపు కోళ్ల పెంపకందారులు గురించి సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్. ఐ/సి. ఐ./డి ఎస్ పి. లకు లేదా 112 లేదా ఎస్ . బి కంట్రోల్ రూం, అమలాపురం ఫోన్.8143792101 నంబర్లకు సమాచారాన్ని అందించి ఈ క్రమంలో పోలీసు వారికి సహకరించవలసినది గా కోరడమైనది. గౌరవ రాష్ట్ర హైకోర్ట్ వారి మార్గదర్శకాల మేరకు సంబందిత పోలీస్ స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్, మండల తహసిల్దార్ మరియు జంతు హింస నిరోధక స్వచ్ఛంద సభ్యులతో మండల స్థాయి సంయుక్త తనిఖీ బృందాలు (జాయింట్ యాక్షన్ టీమ్స్) ఏర్పాటు చేయడం జరిగినది. సదరు బృందాలు గ్రామాలలో పర్యటించి కోడిపందాలు, గుండాట, పేకాట, స్థలాలు/పొలాలు, కత్తులు కట్టేవాళ్ళు యొక్క వివిరాలు సేకరించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిదిలో గ్రామ స్థాయిలో సంబంధిత ఎస్ ఐ, సి ఐ, డి ఎస్ పి,వారి వారి పరిదిలో కోడిపందాలు, జూదం, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచి, వాటి స్థానంలో ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు, కబడ్డీ ఇతర ఆటలపోటీలు నిర్వహించు కొనుటకు విస్తృత అవగాహనా కార్యక్రమాలు తగు సూచనలు జారీ చేయడం జరిగింది. ప్రత్యేక బృందాలను నియమించి నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ మద్యం త్రాగి వాహనాలు నడిపే వారిపైన, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపైన, బహిరంగ ప్రదేశాలలో అల్లర్లు చేసేవారిపైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కోడిపందాల విషయంలో గౌరవ హైకోర్టు మార్గదర్శకాలను అనుసరించాలని అధికారులందరికీ సూచించడం జరిగినది. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, దీని వలన ప్రజలకు మెరుగైన సేవలను అందించగలుగుతామని ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు.





## యువజన అధ్యక్షులు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్:** రామచంద్రపురం పట్టణంలో స్టీల్ వెల్ మెమోరియల్ చర్చి స్థాపించి 25 సంవత్సరాలైన సందర్భంగా పాస్టర్ బెన్నీ బాబు, యువజన అధ్యక్షులు దొమ్మలపాటి లాలి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టీల్ వెల్ మెమోరియల్ వేడుకలలో భాగంగా గుబ్బల బుజ్జమ్మ, మురమళ్ళ ఝాన్సీ రాణి ఆర్థిక సహాయంతో భోజన సమారాధన విందును దైవ జనులకు, ప్రజలందరికీ ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం చర్చి స్త్రీల సమాజం యూత్ ఆధ్వర్యంలో గుబ్బల బుజ్జమ్మని, మురముల్ల ఝాన్సీ రాణిని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ క్రిస్మస్ వేడుకలకు తుత్తర మూడి బాబులు, లంక నవీన్, మడికి సురేంద్ర, కుందేటి భాను, మందపల్లి ప్రేమానందం తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## కోడిపందేలు వేస్తే కఠిన చర్యలు

**- ఎమ్మెల్యే వేగుళ్ల పిలుపు - చోడవరం కూటమి నాయకులతో ఎమ్మెల్యే వేగుళ్ళ సమావేశం...**

**భీమవరం, విశ్వం వాయిస్ న్యూస్:** పశువుల సంరక్షణకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా జంతు సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జంతువుల పట్ల దయ, కారుణ్యం కలిగి ఉండాలన్నారు. మూగ జీవాలను హింసించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జంతు సంరక్షణ సామాజిక బాధ్యత అన్నారు. సంక్రాంతి పండుగ పేరు చెప్పుకుని కోడి పందేలు నిర్వహించటం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు మాట్లాడుతూ కోడి పందేలు, బరులు నిర్వహించకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.





బుధవారం 8/జనవరి/2025
www.viswamvoice.com
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

### ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రత

## నియమాలు తప్పక పాటించాలి

**- మద్యం సేవించి వాహనం నడపరాదు**
**- రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్:** మీ అశ్రద్ధ పట్ల మీ కుటుంబం, వేరే కుటుంబం రోడ్డున పడకూడదని ఎస్సై డి సురేష్ బాబు అన్నారు. మంగళవారం మండలం మాచవరం నాలుగు రోడ్ల కూడలిలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై, రోడ్డు ప్రమాదాల ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి అయన పలు సూచనలను చేశారు. స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు, ఆటోలను నడిపే సమయంలో విద్యార్థులపై శ్రద్ధ వహించి, తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి ఆటోలను నడపడం, నిర్లక్ష్యంగా రోడ్లపై ఇష్టానుసారంగా ఆటోలను నిలిపివేసి, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎస్సై కోరారు.

## కొబ్బరి ముడి సరుకు ఆధారంగా విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

**జిల్లా కలెక్టర్ అర్.మహేష్‌కుమార్**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న కొబ్బరి ముడి సరుకు ఆధారంగా విలువ ఆధారిత పరిశ్రమలు కేరళ, తమిళనాడు మాదిరిగా స్థాపనకై ఉద్యాన, పరిశ్రమల శాఖ అధికారులు సమన్వయంతో ఎక్స్ పో జర్ సందర్శన చేసి అధ్యయనం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ నందు కమిటీ సభ్యులతో నిర్వహించారు. వివిధ పరిశ్రమలకు రాయితీలు కల్పన ప్రధానమంత్రి ఉపాధి కల్పన, ఏక గవాక్ష విధానంలో అనుమతులు మంజూరు కొత్త పరిశ్ర మల పాలసీ 2024- 2029, క్వాయర్ పరిశ్రమలు పై పోకస్, రోడ్ల నిర్మాణ రంగానికి సంబం ధించి కొబ్బరి ఆధారిత జియో టెక్ష్టైల్ మ్యాట్లు తయారీ, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ఎం ఎస్ ఎం ఇ యూనిట్లు స్థాపన ఓపెన్ నెట్వర్క్ డిజిటల్ ఈ కామర్స్ విధానంలో ట్రేడర్స్ రిజిస్ట్రేషన్ వినియోగదా రులు ఆర్డర్లు, ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత టార్గెట్ క్లస్టర్ అభి వృద్ధి కార్యక్రమాలు రాయ వరం మండలం మాచవరం లో పప్పు దినుసులు క్లస్టర్ ఏర్పాటు పురోగతి, మామిడి కుదురు, మల్కిపురం గ్రామా లలో కొబ్బరి ఆదారిత యూ నిట్ల ఏర్పాటులో పురోగతి, ఆత్రేయపురంలో పూతరేకులు క్లస్టర్ ఏర్పాటు, వంటి పురోగ తి అంశాలపై కమిటీ సభ్యు లతో సమీక్షించారు ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలతో పరిశ్రమల స్థాప నకై అవకాశాలు కల్పిస్తున్నా యని ఆ స్థాయిలో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ఆ దిశగా కమిటీ సభ్యులు చైతన్యాన్ని తీసుకొని వచ్చి ప్రోత్సహించాలని సూచించారు. కొబ్బరి ముడిసరుకు ఆధారంగా వర్జిన్ కోకోనట్ కొబ్బరి వాటర్ ద్వారా పౌడర్ తయారీ, కోకో పిట్ తయారీ వంటి విలువ ఆదారిత రంగాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని అందుకు అవసరమైన క్లస్టర్ డెవలప్మెంట్ పరిశ్రమల స్థాపనకై అనువైన స్థలాలను ఎంపిక చేయడంతో పాటుగా పరిశ్ర మల స్థాపనకై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఎంపిక చేయాలని సూచించారు ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీఎస్) ఉపాధికి ఊతం, ఉన్నతికి మార్గమన్నారు. స్వయం ఉపాధితో పాటు మరో పదిమందికి ఉపాధి చూపేం దుకు, జీవితంలో ఉన్నతికి పీఎంఈజీఎస్ పథకం ఉప యోగ పడుతుందని, యువ త ఆసక్తికి అనుగుణంగా స్వయం ఉపాధి మార్గాలను చూపడం ద్వారా సమగ్రాభి వృద్ధి సాధ్యమవుతుందని, ఈ క్రమంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రెడిట్ లింక్డ్‌తో పాటుగా రాయితీ కల్పించి పారిశ్రామికంగా, ఉపాధి కల్పన పరంగా ప్రగతిని సాధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్వయం ఉపాధి పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన వారు సద్వినియోగం చేసు కునేలా ముందుకు నడిపిం చాలని అధికారులకు సూచించారు, స్వర్ణాంధ్ర ఏ 2047 సాధన దిశగా వివిధ శాఖల అధికారులు నిబద్ధ తతో పని చేయాలన్నారు. యువతకు వినూత్న ఆలో చనలతో ముందుకు రావా లని ,ఎస్సీ, ఎస్టీ, మహిళ లకు అదనపు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందని, ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోం దన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్, సహాయ సంచాల కులు శివరాం ప్రసాద్, ఉద్యాన అధికారి బివి రమణ, డి ఆర్ డి ఎ పి డి శివ శంకర్ ప్రసాద్ డ్వామా పీడీ మధుసూదన్, సిడ్బి ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరావు, ఎల్ డి ఎం కేశవ వర్మ, కాయర్ బోర్డ్ ప్రతినిధి వినోద్ కుమార్ కోకోనట్ బోర్డ్ ప్రతినిధి కుమార్, డి ఐ పి ఆర్ ఓ కే లక్ష్మీనారాయణ వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

### నేటి నుంచి పాఠశాలల్లో

## తర్ల్ మిడ్‌లైన్ పరీక్షలు



**కపిలేశ్వరపురం, విశ్వం వాయిస్ న్యూస్:** జిల్లాలోని 3,4,5 తరగతులకు బోధన చేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, విలీన ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 7, 8 తేదీల్లో టీచింగ్ ఎట్ రైట్ లెవల్(తర్ల్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు. మండలంలోని టేకి నంబర్ 1 ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 3,4,5 తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకుని, వారి స్థాయికి అనుగుణంగా విద్యాబోధన చేసేందుకు తర్ల్ ప్రోగ్రామ్‌ను పాఠశాలల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తెలుగులో చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని తెలుసుకుని, అందుకనుగుణంగా బోధన చేయడమే తర్ల్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో 1,253 పాఠశాలల్లోని 23,513 మంది విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించామన్నారు. బేస్‌లైన్ టెస్ట్‌లో విద్యార్థులు స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారని, ప్రస్తుతం విద్యార్థుల స్థాయిని అంచనా వేసేందుకు మంగళ, బుధవారాల్లో మిడ్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా నేతృత్వంలో మిడ్‌లైన్ పరీక్ష నిర్వహణకు క్షేత్ర స్థాయికి ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## క్రీడోత్సవ ఏర్పాట్లపై విద్యాశాఖాధికారులపై మండి పడ్డ ఎం.ఎల్.ఎ

**ఆగ్రహం, అసహనం వ్యక్తం చేసిన ఎం.ఎల్.ఎ**



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడోత్సవాలకు అరకొర ఏర్పాట్లు చేసిన విద్యా శాఖాధికార్లపై పి.గన్నవరం ఎం.ఎల్.ఎ గిడ్డి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో మంగళవారం క్రీడోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గిరి సత్యనారాయణ పాల్గొన్నారు. పీఈటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. కనీసం ఎస్ఎంసి చైర్మన్ కు గాని హెచ్ఎం కు కూడా భాగస్వామ్యం లేకుండా క్రీడోత్సవాలు నిర్వహించడంపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు కూటమి నాయకులు తీవ్ర అసంతృప్తి చెందారు. క్రీడోత్సవాల ప్రారంభోత్సవానికి వస్తున్న ఎం.ఎల్.ఎ కు కనీసం స్వాగత ఫ్లెక్సీ ఎందుకు ఏర్పాటు చేయలేదని జనసేన నాయకులు మహిపాల తాతాజీ అధికారులను నిలదీశారు.క్రీడా పోటీలను ప్రారంభించే విషయంలో రిబ్బన్ కత్తిరించేందుకు కనీసం కత్తెర కూడా ఏర్పాటు చేయలేకపోయారని అధికారులపై ఎం.ఎల్.ఎ. అసహనం చెంది వెనుదిరిగారు.తమకు కూడా ఎందుకు సమాచారం ఇవ్వలేదని కూటమి నాయకులు అధికారులను నిలదీశారు . మాకు చెపితే ఏర్పాట్లు మేమే చేసుకుని ఉండేవాళ్ళం కదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. శానిటేషన్ లేకపోవడంతో పాటు ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో కూడా, కూటమి నాయకుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో జరుగుతున్న క్రీడోత్సవాలపై స్థానిక నాయకులకు కూడా సమాచారం ఇవ్వకపోవడంతో ఎంఈఓ లను కూటమి నాయకులు నిలదీశారు.కాగా అధికారుల చర్యలతో ఎం.ఎల్.ఎ. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి జాతీయ, క్రీడాపతాకాలను నామమాత్రంగా ఎగురవేసి అసంతృప్తితో ఎమ్మెల్యే గిడ్డి వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ సిరిగినీడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వంరావు, జడ్పిటిసి బూడిద వరలక్ష్మి, అరిగెల బలరామ్మూర్తి, రావణం రాము, గణపతి వీర రాఘవులు, సర్పంచులు జల్లి బాలరాజు, నాగబత్తుల శాంతకుమారి, కొర్లపాటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సరోవర్‌రావు, ఎస్ఎంసి చైర్మన్ పితాని త్రిమూర్తులు , నాగబత్తుల వెంకట సుబ్బారావు, ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు, నేతల నాగరాజు , జనసేన మండల అధ్యక్షులు దొమ్మేటి సాయి కృష్ణ , అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### క్రీడా పోటీల ద్వారా

## విద్యార్థులకు అవకాశాలు వస్తాయి

**ఎంపీపీ నౌడు వెంకటరమణ**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్:** క్రీడా పోటీలు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అవకాశాలు వస్తాయని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయవరం శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లో మంగళవారం కోనసీమ క్రీడా ఉత్సవాలను ఎంపీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండలం అభివృద్ధి అధికారిని ఎంపీడీవో ఎన్ కీర్తి స్పందన, తహసిల్దారు ఐపీ శెట్టి, మండల విద్యాశాఖ అధికారులు పి రామ లక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, ఏ ఎం ఓ పిల్లి రాంబాబు, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, తెదేపా సీనియర్ నాయకులు ఉండవిల్లి రాంబాబు, పి ఎం సి చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు (చిన్ని)ల నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహించారు. మండలం లోని మొత్తం 46 పాఠశాలల్లో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నా రు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిషత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నతర పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి శాంతి సునీత, ఆయా గ్రామాల పాఠశాలల పీడీలు, ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులు, మండల పరిషత్ సిబ్బంది, 12 గ్రామాల పాఠశాలలలోని సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కోనసీమ క్రీడోత్సవాలు ఆరంభం

**- క్రీడోత్సవాల ద్వారా గ్రామీణ ప్రాంతా క్రీడ నైపుణ్య విద్యార్థులను గుర్తించవచ్చు**
**- మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్:** క్రీడా పోటీలు ద్వారా గ్రామీణ ప్రాంతా క్రీడా నైపుణ్య విద్యార్థులను గుర్తించి వారికి మరింత అవకాశాలు కల్పించడానికి ఈ క్రీడోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని మండపేట పురపాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పేర్కొన్నారు. మండపేట వేగుళ్ళ సూర్యారావు ప్రభుత్వ పాఠశాల జూనియర్ కాలేజి క్రీడా మైదానంలో కోనసీమ క్రీడా ఉత్సవాలను చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ప్రారంభించారు.మండపేట మండలం అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ టివి రంగారావు,మండపేట మండలం విద్య శాఖ అధికారి నాయుడు రామచంద్ర రావుల నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహించారు. మండలం, మున్సిపాలిటీలోని మొత్తం మూడు ఉన్నత,12 ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.వాలిబాల్, కో కో, కబడ్డీ, ఇతర ఆటల పోటీలు జరిగాయి. 7,8,9 తరగతుల విద్యార్థులు 4,5,6 విద్యార్థులు పలు విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమం లో చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే వారికి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ఇవి తోడ్పడు తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో మండపేట వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వర రావు, ఎంపీడీఓ కార్యాలయ సుపరెండెంట్ వెల్లంకి నాగేంద్ర ప్రసాద్, ఈ ఓ పి ర్డి దాసరి శ్రీనివాస్, ఏం ఈ ఓ సోమిరెడ్డి, మత్స్య శాఖ అధికారి విల్లా రమణ, ఏడిద జడ్పీ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ముంగర వెంకటరాజు, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో ముందుకు వెళదాం

**- మంత్రి సుభాష్ పిలుపు - స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి**
**- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం**



**రామచంద్రపురం నియోజకవర్గం, విశ్వం వాయిస్ న్యూస్:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన రామచంద్రపురం పట్టణ కార్యకర్తల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలో పార్టీ సభ్యత్వాలు 55 వేలకు పైగా, పట్టణంలో 11 వేలకు పైగా నమోదు చేసుకుని నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఎవరూ నిరాశ చెందనవసరం లేదన్నారు. తెలుగుదేశం పార్టీకు కార్యకర్తలే బలమని, ఎల్లప్పుడూ కార్యకర్తల వెన్నంటే ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**- సంక్రాంతి పండుగను సంస్కృతి సాంప్రదాయంగా జరుపుకుందాం**
**- సిఐ పి దొర రాజు**



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్:** సంక్రాంతి పురస్కరించుకొని కోడి పందాలు నిర్వహిస్తే కఠినచర్యలు ఉంటాయని మండపేట రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్, పి. దొరరాజు హెచ్చరించారు. మండపేట మండలం,కపిలేశ్వరపురం మండలం, రాయవరం మండల ప్రజలు సంక్రాంతి పండుగను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా సంస్కృతి, సాంప్రదాయ బద్ధంగా ఆహ్లాదకరమైన వాతావణంలో జరుపుకోవాలన్నారు. కోడిపందాలు, పేకాట గుండాట ఆడటం నిర్వహించడం పాల్గొనడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. గతంలో కోడి పందెలు ఆడిన వారిని, వాటిని నిర్వహించిన వారిని ఇప్పటివరకూ మండపేట రూరల్, రాయవరం, అంగర పోలిస్ స్టేషన్ పరిధిలో సుమారుగా 50 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. కోడి కత్తులు కట్టేవారిపైనా, పందాలు నిర్వహించే వారిపైన పేకాట, గుండాట నిర్వాహకుల పైన చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్:** క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ప్రత్తిపాడు సి ఐ బి సూరి అప్పారావు అన్నారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన క్రీడోత్సవాలను ఆయన ఏలేశ్వరంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కోడిపందాలు గుండాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి కుటుంబాలతో పండగను ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సాంప్రదాయ క్రీడల ద్వారా యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పింద్రాల శ్రీను యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి జ్యోతుల పెద్దబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో చైర్మన్ జొన్నాడ వీరబాబు, ఏలేశ్వరం ఎస్ ఐ ఎన్ రామలింగేశ్వర రావు, సిబ్బంది ఉన్నారు.



## తాళ్లరేవు సుంకరపాలెంలో కంటైనర్ బోల్తా

### తృటిలో తప్పిన ప్రమాదం

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** మండలంలోని సీతారాంపురం రొయ్యల కంపెనీకి చెందిన కంటైనర్ లారీ తెల్లవారుజామున సంకరపాలెం 216వ జాతీయ రహదారిపై బోల్తా పడింది. స్థానిక వివరాల ప్రకారం తాళ్ళరేవు నుండి బయలుదేరి స్థానిక సుంకర పాలెం వచ్చేసరికి కంటైనర్ లారీ అదుపుతప్పింది. రోడ్డుపై బోల్తా పడి 20 మీటర్ల దూరంలో ఉన్న రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు వైపు దూసుకెళ్లింది. పక్కనే ఉన్న ఇటుకలు గుట్ట ఉండడంతో అక్కడ ఆగింది. ప్రమాదం జరగడానికి ముందు పది నిమిషాలు సమీపంలో టీ స్టాల్ వద్ద సుమారు 50 మంది ఉన్నారని, వారు అక్కడి నుంచి వెళ్ళిపోయిన కొద్దిసేపటి తర్వాత ప్రమాదం జరగడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు ఒక ఆటో స్వల్పంగా ధ్వంసం అయినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ జిల్లా ఎడిషన్
బుధవారం 8/జనవరి/2025
www.viswamvoice.com






### అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక స్వామి దేవాలయాన్ని

## ప్లాస్టిక్ రహిత దేవాలయంగా తీర్చిదిద్దాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అయినవిల్లి జనవరి 7: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ సిద్ధి వినాయక స్వామి దేవాలయాన్ని ప్లాస్టిక్ రహిత దేవాలయంగా తీర్చిదిద్దాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి దేవాలయ అధి కారులు ఆదేశించారు. మంగళవారం స్థానిక దేవాలయ బోర్డు కార్యాలయంలో ఆమె వివిధ శాఖాధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్షా సమా వేశం నిర్వహించి పలు అభివృద్ధి అంశాలపై సమీక్షించారు ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడు తూ అయినవిల్లి సిద్ధి వినాయక స్వామి ఆల యానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిం చాలని ఆదేశించారు అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయ ఆవరణ లో ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులను, కవర్లను అనుమతించరాదని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నిబంధన ఈనెల 14వ తేదీ సంక్రాం తి పండుగ నుండే అమలు చేయాలని ఆలయ, పంచాయి తీ అధికారులను ఆదేశిం చారు. భక్తుల సౌకర్యార్థం శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయం ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధి స్తున్నమని జేసి ప్రకటించారు. జిల్లాలో తొలిసా రిగా ఈ విఘ్నేశ్వర స్వామి ఆలయం నుంచే ఈ కార్యక్రమం మొదలు పెట్టడం జరుగుతుంద న్నారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం సంక్రాంతి నుంచే అమల్లోకి రానుందన్నారు ఆలయంలో ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా వేరే బుట్టలు వస్తువులను వినియోగించేలా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ కి బదులు ప్రత్యామ్నాయ వెదురు బుట్టలు, స్టీల్ కలసాలు తీసుకెళ్ళాలా భక్తులకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. అలాగే ఆలయ సమీపాన వ్యాపారం చేస్తున్న వారు కూడా ప్లాస్టిక్ కు బదులు ప్రత్యామ్నాయ వస్తువు లను ఆలయ అధికారు లు సూచించిన విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె తెలిపారు. పర్వది నాలలో ట్రాఫిక్ విషయంలో చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు వస్తున్నాయని జేసి దృష్టికి తీసుకెళ్ళాగా. వాహనాల పార్కింగ్ కొరకు ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో స్థలాన్ని పరిశీ లించాలని తాసిల్దార్ ను ఆదేశించారు. ఆలయం లో వ్యర్ధాలను సేకరించేం దుకు పంచాయతీ అధి కారులు ఒక ట్రాక్టర్ ట్రక్కును ఏర్పాటు చేయాలన్నారు టీటీడీ భవనంలో భక్తులకు వసతి ఏర్పాట్లు తోపాటు ఉచిత భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. వాలంటీ ర్ల సేవలను రద్దీ పర్వది నాలలో సక్రమంగా వినియోగించుకుని భక్తుల తక్కువ సమ యంలో దేవుని దర్శించు కుని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగలక్ష్మి దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితునికి రూ. 5వేలు ముదునూరి సహాయం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామనికి చెందిన ముదునూరి మురళీ కృష్ణం రాజు చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరవధికంగా కొనసాగు తున్నాయి. ధర్మవరం గ్రామ ఆటో డ్రైవర్ కొట్నాల మధు ఇటీవలే ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీ కృష్ణం రాజు నేరుగా కొట్నాల మధు ఇంటికి చేరుకుని పలకరించారు. ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసు కున్నారు. అంతే కాకుండా ప్రమాద బాధితుడు మధుకి వైద్యం ఖర్చుల నిమిత్తం తాత్కాలిక ఉపశమనంగా రూ. 5,000 లను ట్రస్ట్ తరపున ఆర్థిక సాయంగా ముదునూరి మురళీ కృష్ణంరాజు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నానిపల్లి చంటి, వార్డు నెంబర్ కుప్పిన శ్రీను, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, యాళ్ళ యేసు, జువ్వల ముసలియ్యా, ముడదా యేసు, భాస్కర్, రాజా, రాజేష్, శ్రీను, సామ్యూల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు

## 53వ రోజు జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు ధర్నా



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్:** గత నవంబర్ 16 వ తేదీన మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల యాజమాన్యం అర్ధాంతరంగా మూసివేయడంతో రోడ్డునపడ్డ 406 మంది కార్మికులు గత 53 రోజులుగా అనేక విధాల ఆందోళన నిర్వహిస్తున్నారు. ఆందోళనలో భాగంగా మంగళవారం ఫ్యాక్టరీ ఎదుట 53 వ రోజు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత 53 రోజులుగా కార్మికులు ఆకలితో అలమటిస్తూ అనేక విధాల ఆందోళనలు చేస్తున్న ప్రజాప్రతినిధులకు, యాజమాన్యానికి చీమకుట్టినట్టైనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మిక సమస్యలు పరిష్కరించ లేమని పాత మాటే చెబుతూ కాలయాపన చేశారన్నారు. ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి ఆది, ఎం కాంతారావు రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, పాపారత్నం, చంటి, వరలక్ష్మి ఉన్నారు.

## మంచినీటి చెరువుల పరిశీలన

### జడ్పీ సీఈవో లక్ష్మణరావు


**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** మండలంలోని ప్రతి గ్రామానికి తాగునీటి సమస్యలు అధిగమిస్తామని జెడ్పిసిఓ లక్ష్మణరావు సూచించారు. ఫోటోల సాలరీ రక్షిత మంచినీటి చెరువులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ప్రతి గ్రామానికి తాగునీటి సమస్యలు పరిష్కారం చేసి, స్వచ్ఛమైన తాగునీరుని అందించడానికి కృషి చేయాలని అన్నారు.

## నైపుణ్యంతో ఉద్యోగాలు సాధించాలి

### ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ డాక్టర్ ఎం విలియం కేరి

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** ఫార్మసీ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని చక్కగా మెరుగుపరుచుకుని ఉద్యోగ అవకాశాలని చేజిక్కించుకునే విధంగా ఉండాలని ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ డాక్టర్ ఎం విలియం కేరి అన్నారు. కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో పిఎంకెవివై స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ దున్నా జనార్దన్ రావు మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థిలు విద్యతో పాటు ఫార్మసీ కంపెనీలపై శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ కనకరాజు, ప్రిన్సిపాల్ సువర్ణ జ్యోతి, డైరెక్టర్ చిట్టూరి కలికి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో త్వరితగతిన ప్రయోజనం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మధ్యవర్తిత్వం ద్వారా సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం సమకూరుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థలో గంధం సునీత ఆధ్వర్యంలో 5 రోజుల పాటు జరిగే మధ్యవర్తిత్వ తర్ఫీదు కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ దీని వల్ల సామరస్యపూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ గాయత్రి దేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన 24 మంది అదనపు జిల్లా న్యాయమూర్తులు ఉన్నారు.

## జాతీయ విద్యావిధానం వద్దు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో జాతీయ విద్యా విధానం 2020 విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తుందని యూటీఎఫ్ స్వర్ణో త్సవ మహాసభల్లో మేధావులు, విద్యావేత్తలు వ్యతిరేకించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభల్లో రెండోరోజు సోమ వారం జరిగిన విద్యా సదస్సుకు యూటీఎఫ్ అసోసియేట్ సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. సదస్సులో ప్రముఖ విద్యావేత్త, మాజీ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 వల్ల దేశంలో విద్యాభివృద్ధి కుంటుప డుతుందన్నారు. ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సీఎన్.భారతి మాట్లాడుతూ దేశంలో విద్య పూర్తిగా వ్యాపారం అయిపోందన్నారు. ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధ రించాలన్నారు. ఉపాధ్యా యులు సామాజికం, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్నప్పుడే మంచి బోధన జరుగుతుంద న్నారు. ఏపీఎన్‌జీవో అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. ఏపీఎన్‌జీవో నాయ కుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యో గుల సమస్యలను పరిష్కరించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ప్రభుత్వ పాఠ శాల విద్య ధ్వంసమైందని, అనేక పాఠశాలలు ఏకో పాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. ప్రభు త్వం తక్షణమే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, గోపిమూర్తి, ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.నగేష్, చక్రవర్తి, రాష్ట్రకార్యదర్శులు మోహన్‌రావు, కిషోర్, మనోహర్, లక్ష్మీరాజ్యం, జ్యోతిబసు పాల్గొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో సోమవారం ప్రత్యేకంగా మహిళా సాహిత్య సదస్సు జరిగింది. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు కుమార్‌రాజా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావ్లే మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. మార్కెట్ ప్రభావం నుంచి నేటి తరం బాలలను రక్షించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అమ్మ, ఏడుతరాలు, స్పార్టకస్ వంటి నవలలను ఉపాధ్యాయునులు చదవాలన్నారు. తద్వారా ఉపాధ్యాయులతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రముఖ రచయి త అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ చేతులు జోడించడం ద్వారా కాకుండా చేతులు బిగించడం ద్వారా అభివృద్ధి చెందు తామన్నారు. సాహిత్యం మనుషులను సంస్కరిస్తుం దన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ సాహిత్యం మరో నవ సమాజాన్ని నిర్మిస్తుందన్నారు.

## నేత్రదానం



**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** తాళ్ళరేవు మండల పి మల్లవరం గ్రామానికి చెందిన తోట రామకృష్ణ (75) సోమవారం మృతి చెందారు. అతని కార్నియాలను కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు, చిన్నాల అంగీకారంతో పాదం బాలకృష్ణ ఐ బ్యాంకు సిబ్బంది సేకరించారు. మృతిని కార్నియాలను నేత్రదానం చేయడానికి సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ (బాబి) ప్రోత్సహించి బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి కార్నియాలను తీసుకున్నారు.

## గోవింద నామస్మరణతో పులకించిన వాడపల్లి



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం గోవింద నామస్మరణతో పులకించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం జరిపారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఒకరోజు ఆదాయం రూ.2,74,264 వచ్చిందని ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

## సంక్రాంతికి సాంప్రదాయ క్రీడలే ముద్దు..

### - జూద క్రీడలు వద్దు...
### - రాయవరం ఎస్సై డి సురేష్ బాబు..

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సంక్రాంతి పురస్కరించుకొని అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై డి సురేష్ బాబు హెచ్చరించారు. రాయవరం కుర్మాపురం గ్రామంలో మంగళవారం రోజున గ్రామస్తులందరితో రాబోయే సంక్రాంతి సందర్భంగా జూద క్రీడలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై డి సురేష్ బాబు గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలు సంక్రాంతి పండుగను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా సంస్కృతి, సాంప్రదాయ బద్ధంగా ఆహ్లాదకరమైన వాతావణంలో జరుపు కోవాలన్నారు. కోడిపందాలు, పేకాట గుండాట ఆడటం నిర్వహించడం పాల్గొనడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. గతంలో కోడి పందాలు ఆడిన వారిని, వాటిని నిర్వహించిన వారిని ఇప్పటి వరకూ రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురుపై కేసులు బైండోవర్ చేసినట్లు చెప్పారు. మేజిస్ట్రేట్ ముందు హాజరిపరచినట్లు చెప్పారు.




ఇంకా మిగిలిన వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. మండలం లోని రైతులు మరే ఇతర భూ యజమానులు వారి స్థలాలలో కోడిపందాలు, గుండాట, పేకాట, రికార్డింగ్ డాన్స్, అశ్లీల నృత్యాలు వంటి మరే ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించుటకు అనుమతించరాదన్నారు. అలా అనుమతించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసుకు శుభాకాంక్షలు కనకాల రాజా బృందం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక వి.యల్ పురం తిలక్ రోడ్ తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ ను మహాలక్ష్మి తోపుడు బళ్ల వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు కనకాల రాజా అసోషియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పండ్లను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు.



## తల్లికి వందనం అంటూ పంగనామాలు

### - కూటమి సర్కార్ పై వైసీపీ షేక్ నిజాం మండిపాటు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** తల్లికి వందనం పథకం అమలు చేస్తామంటూ ఊరిస్తూ కూటమి సర్కార్ ప్రజలకు పంగనామాలు పెట్టేందుకు సిద్ధమవుతోందని వైసిపి మైనార్టీ రాష్ట్ర నాయకులు నిజాం విమర్శించారు. వైయస్ జగన్ కంటే మెరుగైన పథకాలు తీసుకొస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినా కూటమి అధికారంలోకి వచ్చాక చేతులెత్తేసి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. జగన్ కంటే మెరుగైన సంక్షేమం అందిస్తారని ఆశించిన ప్రజలు కూటమికి ఓటేశారని ఆయన తెలిపారు. కానీ సంక్షేమం అంటే వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని తాజాగా స్పష్టమవుతోందని ఆయన వెల్లడించారు. మోసం చేసిన కూటమి సర్కార్ కు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తారో కుటుంబంలో ఎంత మందికి అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని తెలిపారు.



# సిద్ధి వినాయక పాసింజర్ ఆటో యూనియన్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే రౌతు, బాక్స్ ప్రసాద్,మజ్జి రాంబాబు
### 11వ సంక్రాంతి సంబరాలు, డ్రైవర్లకు ఆర్థిక సాయం,ఆటో టైర్లు బహుకారణ





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సిద్ధి వినాయక పాసింజర్ ఆటో యూనియన్ 11వ సంక్రాంతి సంబరాలను స్థానిక గోదావరి గట్టుపై ఉన్న రజక కళ్యాణం నందు సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశ రావు,జిల్లా టీడీపి పార్లమెంటరీ కార్యదర్శి నాయకులు మజ్జి రాంబాబు, యూనియన్ నాయకుడు బాక్స్ ప్రసాద్ హాజరయ్యారు.యూనియన్ అధ్యక్షులు సురేష్ నాయుడు మాట్లాడుతూ యూనియన్ సభ్యులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ స్థాపించి 30 సంవత్సరాల అయినదని 17 సంవత్సరాలుగా యూనియన్ అధ్యక్షునిగా కొనసాగుతున్నానని 11సంవత్సరాల నుండి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నా మన్నారు.ఈ సంక్రాంతికి సభ్యులందరికీ యూనియన్ తరపు నుండి ఒక్కొక్కరికి 20 వేల రూపాయలు నగదు,రెండు ఆటో టైర్లు,స్వీట్ బాక్స్ అందజేస్తున్నాం,సభ్యత రుసుములు వసూలు చేసి డబ్బు ను తమ సంఘంలోని సభ్యులకే అత్యవసర పరిస్థితుల్లో వాహన మరమ్మత్తులకు,వడ్డీకి అప్పు ఇస్తామని ఆ వచ్చిన వడ్డీ డబ్బులు సంవత్సరానికి ఒకసారి సంక్రాంతి పండుగకు పంచుకుంటామని అన్నారు. తమ యూనియన్ సభ్యుల పిల్లలు బీటెక్ సివిల్స్ తదితర కోర్సులు చదివి ఉద్యోగాలు చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ యూనియన్ సభ్యులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మజ్జి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కార్మికుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు.సిద్ధి వినాయక పాసింజర్ ఆటో యూనియన్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. సెంట్రల్ విజిటబుల్ మార్కెట్ పుష్కరాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతానికి తరలి వెళ్లే అవకాశం ఉందన్నారు.ఆ ప్రాం తంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయించడానికి కృషి చేస్తానన్నారు. తదుపరి యూ నియన్ సభ్యులకు ఆటో యూనియన్ సభ్యులకు పిఎఫ్, ఈఎస్ఐ తదితర సదుపాయాలు ఆటో కార్మికులకు ఏర్పాటు చేయడానికి చేస్తానన్నారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సిద్ధి వినాయక పాసింజర్ ఆటో యూనియన్ అందరూ ఆద ర్శంగా తీసుకోవాలని అన్నారు.సిద్ధి వినాయక పాసింజర్ ఆటో యూనియన్ అధ్యక్షులు సేపేని సురేష్ నాయుడు, గౌరవ సలహాదారులు కర్రీ ఏసుబాబు మరియు సంసాని కిట్టు నేతృత్వంలో ఉపాధ్యక్షులు పసుపులేటి నాని, సెక్రటరీ పాటూరి కుమార్, జాయింట్ సెక్రటరీ పినిశెట్టి శేఖర్, ట్రెజరర్ తాడితోట రమణ,వీర రాఘవులు, రఘు, రాజు,రెల్లి రమణ,రాజు, బాపిరాజు, తిమోతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర రాంబాబు సేవలు ఆదర్శనీయం

### మదర్ తెరిసా మార్గంలో స్వర్ణాంధ సేవలు
### 200 మంది వృద్ధులకు రగ్గులు, కాస్మెటిక్స్ నగదు ఆదిరెడ్డి చేతులు మీదుగా పంపిణీ
### స్వర్ణాంధ్ర సేవలకు సహకరిస్తాను ఎమ్మెల్యే ఆదిరెడ్డి





**రాజమహేంద్రవరం విశ్వం వాయిస్ న్యూస్:** స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవ సంస్థ గత 27 సంవత్సరాలుగా రాజమండ్రి నగరంలో పలు సామాజిక సేవలు అందిస్తూ అందరు మనలను పొందిందని నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.మంగళవారం సాయంత్రం స్థానిక లాలాచెరువు లో గల స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో పునర్ నిర్మించిన మదర్ తెరిసా విగ్రహాన్ని ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. తొలిత మదర్ తెరిసా విగ్రహానికి గజమాలను వేసి నివాళు లర్పించారు.మదర్ తెరిసా ఆదర్శంగా స్వర్ణాంధ్ర అన్నార్తులు,వృద్ధులు, అనాధలు, నిరాశ్రయుల కోసం విశేష సేవలు అందిస్తుందని ప్రశంసించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవల్లో స్వర్ణాంధ్ర బహుముఖ సేవలు అందిస్తూ అగ్రగామిగా నిలుస్తుంది అన్నారు.స్వర్ణాంధ్ర రాంబాబు తన ఉద్యోగంతో పాటు స్వర్ణాంధ్ర ద్వారా అంకితభావంతో సేవలు అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు.స్వర్ణాంధ్రకు ఎలాంటి సహకారం కావలసిన తాను అందిస్తానని హామీ ఇచ్చారు.స్వర్ణాంధ్ర చేస్తున్న సేవలకు సహకరిస్తున్న దాతలకు శ్రీనివాస్ అభినందనలు తెలిపారు .ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా నగర ప్రజల దాతల సహకారంతో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఎలాంటి ప్రభుత్వ ,విదేశీ నిధులు లేకుండా దాతల విరాళాలతో నడుపుతున్నామన్నారు.

అవసరార్థులకు సేవలు అందించేందుకు మరింత అంకితభావంతో పనిచేస్తామని అన్నారు.ఈ సందర్భంగా వృద్ధులకు రగ్గులు, కాస్మోటిక్, మనిషికి 100 రూపాయలు నగదు సుమారు 200 మందికి ఆదిరెడ్డి వాసు చేతుల మీదుగా బహుకరించారు.ఈ కార్యక్రమం లో వార్డించార్జ్ నులుకుర్తి రవి యాదవ్ , స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, ధనలక్ష్మి,మీరా కుమారి, దివ్య, కొండలరావు, హరిప్రసాద్,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన బ్రహ్మశ్రీ వడలి కుమార్ శర్మ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** కొంతమూరులోని పద్మాక్షినగర్ లో ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 12వరకు శత చండీ సహిత సూర్యారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పద్మాక్షి సేవా సమితి వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ వడలి కుమార్ శర్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో పక్షదీక్షగా సూర్యారాధన జరుగు తుందన్నారు.ప్రతిరోజు త్రిచ మహాసౌర, అరుణపూర్వక సూర్యనమస్కారాలు, హెూమాలు జరుగుతాయని వెల్లడించారు.దీనిలో భాగంగా ఫిబ్రవరి 4న రథసప్తమి,సూర్య జయంతి నిర్వహించి స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష పుష్పాలతో అర్చన జరుగుతుందని,8,9,10 తేదీల్లో మహాలక్ష్మి ఆరాధన జరుగుతుందని, తామం పువ్వులతో సకల దారిద్ర్య నివృత్తి, ఐశ్వర్య ప్రాప్తి కలుగుతుందన్నారు. మహాలక్ష్మి హెూమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అలాగే విద్యా వ్యాపార,కోర్టు విజయం, ఆరోగ్య, ఆయుష్షు, ఉద్యోగ అభివృద్ధి కోసం శత చండీ పారాయణలు,10 చండీ హెూమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు వడలి కుమార్ శర్మ వివరించారు. ఫిబ్రవరి 12 వ తేదీన సామూహిక సూర్య కల్యాణం అనంతరం పూర్ణాహుతి జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాల్లో పాల్గొనేవారు ముందుగా గోత్ర నామాలు తెలియచేసి రశీదు పొందాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 11.30 గంటలకు భక్తులు సూర్య తీర్థ ప్రసాదాలు స్వీకరించి సూర్యానుగ్రహం పొందాలని కోరారు. ఈనెల 30 వ తేదీ ఉదయం 8.30 గంటలకు భక్తులంతా యాగ సంకల్పంలో పాల్గొనాలని వడలి కుమార్ శర్మ కోరారు. ఈసందర్భంగా పద్మాక్షి సేవా సమితి రూపొం దించిన క్యాలెండరును సోమవారం ఆవిష్క రించారు. కార్యక్రమంలో న్యాయవాది పి.ఎల్.ఎన్. ప్రసాద్,దేవీ ప్రకాష్,ఈవని కాశీ విశ్వేశ్వరరావు దంపతులు, భీమా శంకరం, వారణాసి సతీష్ శర్మ, కృష్ణ, పి.నారాయణ, స్వామి, జి.కొండబబు, మూర్తి పాల్గొన్నారు.

## భవిష్యత్తులో నేతాజీ నగర్ ముంపు లేకుండా చూసే బాధ్యత నాది


### - అభివృద్ధికి స్థానికులు సహరించాలన్న ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్:** భవిష్యత్తులో నేతాజీనగర్ ముంపు లేకుండా చూసే బాధ్యత నేను తీసుకుంటానని, అభివృద్ధికి స్థానికులు సహకరించాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఈరోజు బొమ్మూరు గ్రామంలో నేతాజీ నగర్, సెంటెన్స్ స్కూల్ ఏరియా, బృందావన కాలనీ ప్రాంతాల్లో నూతన సిసి రోడ్లు మరియు డ్రైన్లు నిర్మించుటకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ నేతాజీ నగర్ నందు 30 లక్షల రూపాయలతో సిసి డ్రైన్ నిర్మిస్తున్నామని, గురుకులం వెనక 20 లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్డు, కోహినూరు అపార్ట్మెంట్ వద్ద పార్కు అభివృద్ధికి 10 లక్షల రూపాయలు,సెంటెన్స్ స్కూలు నుండి ఐటిసి వరకు రోడ్డు మరియు డ్రెయిన్ నిర్మాణానికి 50 లక్షలు మరియు బృందావన కాలనీ నందు సిసి రోడ్డు నిర్మాణానికి 15 లక్షల రూపాయలు, మొత్తం కలిపి కోటి 25 లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని, అభివృద్ధి పనులకు స్థానికుల సహకారం కావాలని కోరారు. అలానే అనేక నూతన పనులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, నేతాజీ నగర్ రూపురేఖలు మారుస్తానని గోరంట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, భిమరిశెట్టి రమేష్, కామిని భాస్కర్, కామిని ప్రసాద్, పిల్లా తనుజ,పలివెల సత్య నారాయణ, వంకా మోహన్, కంటిపూడి బాబి, రాయుడు సునీల్, పితాని రాజు, విజయ్ వీర్రాజు, నాగేశ్వరరావు,ఎర్రియ్య, మరడాపు రాంబాబు, కోటిపల్లి అమ్ములు, పేట వీరలక్ష్మి రాయుడు అలేఖ్య, నిడిగట్ల కామేష్, ఏ.ఈ సంపత్ కుమార్ మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో పేపర్ మిల్లు కార్మికులకు అన్యాయం

- మాజీ ఎంపీ భరత్ స్వార్ధానికి కార్మికులు బలి
- మేనేజ్మెంట్ తో లాలూచీ పడ్డాడు
- గత ఐదేళ్లు అగ్రిమెంట్ చేయలేదు
- మా కూటమి ప్రభుత్వం వచ్చింది కార్మికులకు మంచి జరుగుతుంది
- కార్మికుల సమస్య పరిష్కారం అయ్యింది
- మంచి అగ్రిమెంట్ చేస్తాం
- మీడియా సమావేశంలో కాశి నవీన్ కుమార్,రెడ్డి మణేశ్వరరావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** అధికారంలో ఉండగా మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తన స్వార్ధానికి పేపర్ మిల్లు కార్మికులను బలి చేశారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు అన్నారు. తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఈ మేరకు వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. కాశి నవీన్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లు వైకాపా వారు పేపరు మిల్లు అగ్రిమెంట్ చేయలేదన్నారు. కేవలం మార్గాని భరత్ రామ్తన స్వార్థం కోసం అగ్రిమెంట్ జరగకుండా మేనేజ్మెంట్తో లాలూచీ అయ్యిపోయాడని ఆరోపించారు. యాజమాన్యం ఇచ్చే సూట్ కేసులకు అలవాటు పడి కార్మికుల శ్రేయస్సును నిర్లక్ష్యం చేశాడన్నారు. అధికారంలో ఉండగా అప్పుడు తప్పులు చేశారు కాబట్టే ఇప్పుడు పేపరు మిల్లు దగ్గరకు వచ్చి మోహం చూపించుకోలేకపోతున్నాడని ఎద్దేవా చేశారు. కార్మికులకు అన్యాయం చేశాడు కాబట్టే ఇటీవల జరిగిన ఎన్నికల్లో భరత్ రామ్ను కార్మికులు ఓడిరచారని అన్నారు. ఈ రోజున తమ శాసన సభ్యుడు ఆదిరెడ్డి శ్రీనివాస్, మిగిలిన శాసన సభ్యులు, ఎంపీ పురంధేశ్వరి అధ్యక్షతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరకు వెళ్లి... పేపరు మిల్లు కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారని, దీంతో హై పవర్ కమిటీ వేశారని తెలిపారు. అతి దగ్గరలోనే అగ్రిమెంట్లు అవుతాయని వెల్లడిరచారు. తమ కూటమి నాయకులు కార్మికులతో మాట్లాడి వారు చేస్తున్న సమ్మెను విరమింపచేశారని, కూటమి నాయకులు చేసిన చర్చలతో పేపరు మిల్లు యాజమాన్యం కూడా లాక్ అవుట్ను వెనక్కి తీసుకుందన్నారు. ఎన్డీయే కూటమి నాయకులు ఈ వ్యవహారంలో ముందుండి నడిపించి కార్మికుల సమస్యకు పరిష్కారం చూపించారన్నారు. రెడ్డి మణేశ్వరరావు మాట్లాడుతూ భరత్ రామ్ పేపరు మిల్లు వద్ద కార్మికులు ఆందోళన చేస్తుంటే నువ్వు ఎందుకు రాలేదని భరత్ రామ్ను ప్రశ్నించారు. అధికారంలో ఉండగా నిత్యం పేపరు మిల్లు వద్ద సమావేశాలు పెట్టి మీకు అది చేస్తాం... ఇది చేస్తాం అంటూ తెగ వాగ్దానాలు చేసి బాధల్లో ఉన్న కార్మికుల వద్దకు రాకుండా ఇప్పుడు ఎందుకు మోహం చాటేస్తున్నావ్ భరత్ రామ్ అంటూ ప్రశ్నించారు. అతను చేసిన అవినీతి అంతా ఇంతా కాదని చాలా స్కామ్లు చేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలో ఉండగానే టిఎన్టియూసీ ద్వారా పేపరు మిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంట్ చేయించామని గుర్తు చేశారు. క్రమేనా ప్రవీణ్ చౌదరి అనే వ్యక్తి తన స్వార్ధానికి టిఎన్టియూసీని నిర్వీర్యం చేసేశాడని, యూనియన్ల మధ్య కూడా చిచ్చుపెట్టాడని ఆరోపించారు. రాబోయే రోజుల్లో టిఎన్టియూసీని బలపరుస్తామని, కూటమిని ముందుకు తీసుకువెళతామన్నారు. అతి దగ్గరలో మంచి అగ్రిమెంట్ చేయించి, కార్మిక సంఘాల ఎన్నికలు కూడా త్వరలోనే నిర్వహిస్తామన్నారు. మంచి కార్యాచరణతో ముందుకు వెళతామన్నారు. ఇక నుంచి ప్రతి రోజూ కూడా పేపరు మిల్లులో ఏం జరుగుతుందో నగర అధ్యక్షుడిగా తాను పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. ఏవీపీ జయకృష్ణ ఇచ్చిన సూట్ కేసులకు కక్కుర్తిపడే భరత్ రామ్ నోరు మెదపడం లేదని,తమ పార్టీ వారికి సూట్ కేసులు తీసుకునే సంస్కృతి లేదని, తప్పు చేస్తే ఎవర్నీ వదులుపెట్టమని హెచ్చరించారు. మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు మళ్ల వెంకటరాజు, దినేష్, కవులూరి వెంకటరావు, మదీనా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా "నేతాజీ" జయంతి వేడుకల ఆహ్వాన పత్రాన్ని మేడా ఆవిష్కరణ..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** "ఏజెన్సీ టైగర్ "ముత్యాల ముత్యాల రాయుడు మిత్రమండలి "మేడా మహా మిత్రమండలి ,ముత్యాల రాయుడు మిత్రమండలి వాట్సాప్ గ్రూపుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేది ఉదయం రాజమండ్రి ఆనందనగర్ లోని కొట్టాపు సూర్యప్రకాశ్ స్వగృహం వద్ద మరియు సాయంత్రం ఆర్యాపురం లోని అర్పిసి కార్యాలయం ఆవర ణలో నిర్వహించ తలపెట్టిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు "నేతాజీ " సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతి వేడుకల ఆహ్వాన పత్రాన్ని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్తాపక అధ్యక్షులు,ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా)ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ మంగళవారంరాత్రి ఆవిష్కరించారు.పై రెండు మిత్రమండలిల వ్యవ స్థాపక అధ్యక్షులు, న్యాయవాది సుంకర వెంకట భాస్కర రంగారావు, ఇంకా పలువురు "నేతాజీ) అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొ న్నాట్లు "ఏజెన్సీ టైగర్ ముత్యాల ముత్యాల రాయుడు మిత్రమండలి ప్రజా సంబంధాల అధికారి సంగిరెడ్డి రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

## కోరం లేని కారణంగా మూడో పీసా గ్రామసభ వాయిదా



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజుల్లా, రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలం,ఇందుకూరు రెవెన్యూ గ్రామంలోని గ్రామ సచివాలయం నందు ఏర్పాటు చేసిన మూడో పీసా గ్రామ సభ ఎన్నికలు కోరం లేని కారణంతో దేవీపట్నం ఎలక్షన్ అధికారి వెంకటేష్ వాయిదా వేశామన్నారు.ఈ పీసా గ్రామ సభకు సర్పంచ్ కోసు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఇందుకూరు గ్రామ పంచాయితీ సెక్రటరీ సత్య నారాయణ సమక్షంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్,డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమ హేంద్రవరం, మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్ తెల్లంశేఖర్ మాట్లాడుతూ మన్యం ప్రాంతంలో అనేక గ్రామ పంచాయితీలలో కోరం లేదని కారణంతో పీసా గ్రామ సభ ఎలక్షన్స్ వాయిదా మీద వాయిదాలు పడుతుంటే షెడ్యూల్డ్ ప్రాంతంలో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటుందన్నారు. ఈవిధంగా కొనసాగితే ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవ త్సరాలు పూర్తి అయ్యిన ఆదివాసులకు అందని ద్రాక్షగానే మారుతుందన్నారు. ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి ఇందుకూరు గ్రామం మరియు సమస్యాత్మకంగా ఉన్న ఉన్న ప్రదేశాలలో పీసా గ్రామసభ ఎన్నికలకు బ్యాలెట్ ఓటింగ్ సిస్టం (సీక్రెట్ ఓటింగ్) ఏర్పాటు చేయడం ఉత్తమం అన్నారు.ఈ పీసా గ్రామసభ ఎన్నికలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల జోక్యం లేకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా రాములవారి
## తెప్పోత్సవానికి ఆహ్వానం - శ్రీరామగిరి ఆలయ కమిటీ



**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్ (వి ఆర్ పురం )** అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, వి ఆర్ పురం మండలం, శ్రీరామగిరి టెంపుల్ 09: 01: 2025 న గురువారం నాడు సాయంత్రం 4:00 గం " లకు తెప్పోత్సవం కార్యక్రమానికి ప్రజలు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా శ్రీరామగిరి దేవస్థానం తెప్పోత్సవ కమిటీ మనవి.
10:01:2025 న శుక్రవారం నాడు ఉత్తర ద్వార దర్శనానికి నాలుగు దిక్కుల నుండి ప్రజలు మరియు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని శ్రీ రామగిరి ఆలయ కమిటీ వారు తెలియపరిచారు.

## సేంద్రీయ ఎరువుల తయారీపై అవగాహన




**చింతపల్లి, విశ్వం వాయిస్ న్యూస్** సేంద్రీయ ఎరువుల తయారీ పై యువ రైతులు, విద్యార్థులు చైతన్యవంతులు కావాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పరిశోధన స్థానంలో సేంద్రీయ వ్యవసాయం కోర్సులో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సేంద్రీయ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త బాల హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ, సేంద్రీయ వ్యవసాయంలో పంటకు ద్రవ జీవామృతం ఘన జీవామృతం, వర్మి కంపోస్ట్ నాట్ కంపోస్ట్, ఆజోల్ల తరహా ఎరువులను పెట్టుకోవాలన్నారు. ఈ ఎరువులను రైతులు సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సిఎంఎఫ్ రిసోర్స్ పర్సన్ రాజబాబు టీచింగ్ అసోసియేట్ బాబుజి నాయుడు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
మన్యం జిల్లా ఎడిషన్
బుధవారం/8/జనవరి/2025
www.viswamvoice.com


## స్వర్ణోత్సవ సంబరాల్లో రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి పొందిన మండల ఉపాధ్యాయులు



**కూనవరం విశ్వం వాయిస్ న్యూస్ :**
అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడలో జరుగుతున్న స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా గత నెల విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య కళా విజ్ఞాన క్షేత్రం లో యు.టి.ఎఫ్.రాష్ట్ర సాంస్కృతిక కళా నాట్య మండలి ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక నృత్య కళా ప్రదర్శన పోటీలలో కూనవరం మండలం లోని యు.టి.ఎఫ్.మహిళా సబ్ కమిటీ,కూనవరం ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి యు.టి.ఎఫ్.రాష్ట్ర సాంస్కృతిక కళా మండలి కన్వీనర్ ఎస్.ఎస్.నాయుడు గారి చేతుల మీదుగా జ్ఞాపిక ను అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఎస్.నాయుడు మాట్లాడుతు చూడడానికి మీరు విద్యార్థులు లాగా ఉన్నారు కానీ ఉపాధ్యాయులు గా కనిపించడం లేదని, మీరు ప్రదర్శించి న జాన పద రేలా నృత్యం అద్భుతంగా ఉందని, అందరినీ ఆకట్టుకుంటుందని, హుషారుగా ఉందని మీ అందరికీ యు.టి.ఎఫ్. రాష్ట్ర సాంస్కృతిక కళా నాట్య మండలి కమిటీ తరపున ఉద్యమాభినందనాలు తెలిపారు.అలాగే యు.టి.ఎఫ్ కూనవరం మండల అధ్యక్ష/ ప్రధాన కార్యదర్శులు కళా ప్రదర్శన పోటీ లలో గెలు పొందిన వారికి ప్రత్యేక అభినందనలు ఒక ప్రకటనలో తెలిపారు.

### మండల రెవెన్యూ అధికారి ఏ సత్యనారాయణ ఆధ్వర్యంలో
## రాజవొమ్మంగి లో రెవెన్యూ గ్రామ సభ






**రాజవొమ్మంగి విశ్వం వాయిస్ న్యూస్**
రాజవొమ్మంగి, గ్రామ సచివాలయం వద్ద తహసిల్దార్ అల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన నిర్వహించిన సభలో పలు భూ సంబంధిత అర్జీలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. రెవెన్యూ గ్రామ సభ ద్వారా వారసులకు భూమి పంపకం, సరి హద్దులు. సర్వే నెంబర్లను కొలతలు సరి చేసుకోవడమే కాకుండా లేట్ బర్త్ అండ్ డెత్ తో పాటుగా కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు కుల ధ్రువీకరణ, ఇన్కమ్ సర్టిఫికెట్ పొందవచ్చని ఎంపీపీ వెంకట లక్ష్మీ, సర్పంచ్ రమని అన్నారు. డిప్యూటీ తాసిల్దార్ కరీముల్లా, ఆర్ ఐ చెల్లయ్యమ్మ, ఎంపీటీసీలు పెద్దిరాజు,వీరబాబు, విఆర్వో సూర్యకాంతం, పంచాయితి సెక్రటరీ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

### ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో
## సంక్రాంతి సంబరాలు



**అరకు వ్యాలీ, విశ్వం వాయిస్ న్యూస్**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకు వ్యాలీ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈరోజు కళాశాలలో సంక్రాంతి సంబరాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే పుష్పరాజు అధ్యక్ష వహించారు కన్వీనర్ పి సుందరి రాణి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించబడింది.
కార్యక్రమానికి మహిళా కళాశాల ప్రిన్సిపల్ వి చలపతిరావు అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సభ్యులు వై విజయలక్ష్మి, ఎం అనిత కుమారి, కె భవాని, ఎన్ఎస్ఎస్ పిఒ పి నాగబాబు ఐక్యుఎసి కోఆర్డి నేటర్ డాక్టర్ పి కొండబాబు అధ్యాపకులు ఎల్ఎంఎస్ గణేష్ , బి లచ్చన్న, ఎస్ సొంబాబు , ఎస్ సురేష్ , వి కామేశ్వరరావు, ఎస్ అప్పా రావు ఎస్ దొన్ను మహిళా కళాశాల అధ్యాపకులు, కళాశాలలో బాధా నేతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్ర మంలో భాగంగా భోగి మంటలు వేశారు విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.



## మాజీ సర్పంచ్ గర్నేటి సుబ్బారావు పదో వర్ధంతి
### - నివాళులర్పించిన పట్టణ కమిటీ సిపిఎం

**కూనవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని భద్రాచలం డివిజన్ సిపిఎం పార్టీ నిర్మాణ లో ఒకరైన గర్నేటి సుబ్బారావు కూనవరం సర్పంచిగా అనేక సేవలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించినారు.విద్యా పాత్ర ను అంకితభావంతో నిర్వహించిన జూనియర్ కాలేజీ ఈ ప్రాంతంలో రావడానికి జూనియర్ కాలేజీకి స్థలం ఇప్పించడంలో ప్రముఖ పాత్ర పోషించినారు.విద్య పట్ల విద్యార్థుల పట్ల అంకితభావంతో ప్రతి ఒక్క సంస్థలను అనుక్షణం తన పర్యవేక్షణలో ఉంచుతూ సహాయ సహకారాలు అందించేవారు నిరంతరం పార్టీ నియమాలు కట్టుబడి ఈ మండలంలో పార్టీకి పెద్దదిక్కుగా అనేక పోరాటాల్లో ముందుండి నడిపిన ఘనత కామ్రేడ్ సుబ్బారావు దక్కుతుందని వారి ఆశయ సాధనలో పయనించాలని ఈరోజు కూనవరం మాత శ్రీరామమూర్తి భవనంలో జరిగిన పదవ వర్ధంతి సందర్భంగా మండల కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు ఈ సమావేశంలో సుబ్బారావు గారి చిత్రపటానికి గర్నేటి సీతయ్య పూలమాల అలంకరించారు.
సీనియర్ సభ్యులు తలగాని నాగరాజు, గడ్డిపాటి షణ్ముఖరావు, పట్టణ కార్యదర్శి కొండ ఈశ్వర్లు. బొజ్జ సుధారాణి తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు



## సిసి రోడ్లను ప్రారంభించిన మంత్రి



**పాచిపెంట, విశ్వం వాయిస్ న్యూస్ :**
మండ లంలోని మంచాడవలసలో రూ.11లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా రోడ్లపై గుంతలు చూశాం కానీ, గత ప్రభుత్వంలో గుంతల్లో రోడ్లు ఉండేవని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు కల్పిస్తున్నామన్నారు. సాలూరు నియోజకవర్గంలో 100 సిసి రోడ్ల పనులను రూ.5కోట్ల వ్యయంతో నిర్మించామని తెలిపారు. ఇందులో పాచిపెంట మండలంలో 27, మెంటాడ మండలంలో 20, మక్కువ మండలంలో 35, సాలూరు మండలంలో 22 రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. గిరిజన గ్రామాల్లో రహదారులు నిర్మించి డోలీ మోతలు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గిరిజన గ్రామాల్లో ఎక్కడా తాగునీరు, రోడ్ల సమస్య లేకుండా ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. ఉగాది నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానుందని ఆమె తెలిపారు. త్వరలోనే జిల్లాలో 63 అంగన్వాడీ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు వైసిపి నేతలు అడ్డుపడితే సహించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఐటిడిఎ ద్వారా గిరిజనులకు ట్రై రుణాలు అందించి, జీవనాధారం కల్పించి గిరిజనులకు అవసరమైన సదుపాయాలు సమకూర్చి పూర్వవైభవం తీసు కొస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిహెచ్ సావిత్రి, మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు గూడెపు యుగంధర్, ముఖీ సూర్య నారాయణ, ఆముదాల పరమేష్, కె.సురేష్, చల్లా కనక, కె.పోలినాయుడు, పి.నరసింగరావు, పి.ఉమా మహేశ్వరరావు, మాతల బలరాం, జనసేన నాయకులు, ఎంపిడిఒ బివిజె పాత్రో, పంచాయతీరాజ్ శాఖ డిఇ చిన్నంనాయుడు, డిప్యూటీ తహశీల్దార్, పలు శాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా గ్రీవెన్స్ కు విన్నపాల వెల్లువ



**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :**
శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కు విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని విశాఖ ఎ కాలనీని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఉదయం నుంచే ప్రజలు తమ అర్జీలను అందజేసేందుకు పెద్ద ఎత్తున కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గార, శ్రీకాకుళం రూరల్, నగర ప్రజల సమస్యలను తెలుసుకున్న గొండు శంకర్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపించారు. ముఖ్యంగా గ్రామాల్లో రోడ్లు, కాలువలు, డ్రైన్లు నిర్మాణం చేపట్టాలని ప్రజల నుంచి అధికంగా వినతులు వచ్చాయని తెలిపారు. వ్యక్తిగతంగా పింఛన్లు కావాలని, ఇళ్లు మంజూరు చేయాలని పలువురు దరఖాస్తులు అందజేశారు. గత వైసీపీ హయాంలో గ్రామాల్లో కనీస మౌళిక సదుపాయాలైన రోడ్డు, డ్రైన్లు, పారిశుధ్యం, విద్యుత్ వంటి పనులను కూడా చేపట్టక పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ, గ్రామసభలు నిర్వహించి సమస్యలను గుర్తించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ చిన్నాభిన్నం అయ్యాయని, వాటిని తిరిగి పునరుద్దరించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. నిరుపేదల ఆశలు నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరంతం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాటు పడుతోందని వివరించారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, నగర పరిధిలో డ్రైన్లలో షిల్టు తొలగింపు చేపట్టినట్టు చెప్పారు.
అలాగే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం అమ్మిన 24 గంటల్లో నగదును వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి సమస్యలను ఉన్నా తనను నేరుగా కార్యాలయంలో కలవచ్చునని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

## జీడి పప్పు ప్రాసెసింగ్ యూనిట్లకు తోడ్పాటు

**పార్వతీపురం, విశ్వం వాయిస్ న్యూస్ :**
ఐటిడిఎ పరిధిలోని జీడిపపవి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఉద్యాన రైతులకు తోడ్పాటు అందివ్వాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపప్పు మార్కెటింగ్ "లో రైతులు దళారుల బారిపడకుండా విడివికెల ద్వారా మంచి ధర కల్పించేలా వ్యవసాయ, ఉద్యాన వన అధికారులు ప్రోత్సాహాన్ని అందించాలని స్పష్టం చేశారు. ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు లెమన్‌గ్రాస్ సాగుచేస్తున్నది, విస్తీర్ణం అంశాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో లెమన్ గ్రాస్ పెంపకం విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరికి ప్రత్యామ్నాయంగా లెమన్ గ్రాస్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే అవకాశాలను కల్పించవచ్చని అన్నారు. జిల్లాలో సుమారు 200 ఎకరాల్లో లెమన్ గ్రాస్ సాగు చేస్తున్నట్లు అధికారులు తెలపగా శ్రీనిధి, బీసీ కార్పొరేషన్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసి జిల్లా లో వేయి ఎకరాల్లో సాగు లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అవకాశాలను కూడా తెలపాలన్నారు. లెమన్ సాగు ఈ క్రాప్ కింద ఆన్లైన్ లో నమోదు చేయాలని, నమోదైన పంట వివరాలను క్షేత్రస్థాయిలో ఆన్లైన్ లో వివరాలు, విస్తీర్ణ సాగు ఖచ్చితంగా ఉండేలా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పునః పరిశీలన చేయాలన్నారు.




భామినిలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం వద్ద రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎడి మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఐటిడిఎ పరిధిలోని గదబ, సవర గిరిజన కులాల లభిదారులకు గొర్రెలు, మేకలు యూనిట్ల కొనుకోలుకు రుణాలు మంజూరు చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. నీతి ఆయోగ్ ఆశావహ జిల్లాగా ఉన్నందున అన్ని రంగాల్లో అభివద్ధి పనుల సూచికల లక్ష్యాల సాధనకు పురోగతి స్పష్టంగా చూపాలన్నారు. మిల్లెట్ మేళాలను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అటవీ శాఖ అధికారి జిఎపి ప్రసూన, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యం నాయుడు, జిల్లా పశు సంవర్ధకశాఖ డాక్టర్ ఎస్.మన్మధ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, ఐటిడిఎ ఎపిఒ మురళీ, తదితరులు, పాల్గొన్నారు.వడ్డీలేని పంట రుణాలపై అవగాహన కల్పించాలి వచ్చే ఖరీఫ్ సీజన్‌కు రైతులకు లక్షలోపు వడ్డీలేని పంట రుణాలు అందించనున్నందున పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంక్ అధికారులు, పలు శాఖల అధికారులతో డిసిసి, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ 2024- 25 సంవత్సరానికి రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఖరీఫ్ సీజన్ 2023కు తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించిన రైతుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రోసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం కింద యువత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఊతమివ్వాలని అన్నారు. ప్రధాన మంత్రి స్వానిధి, మత్స్యకారుల వీధి వ్యాపారులకు రుణాలు, ముద్రా రుణాలు మంజూరులో కొన్ని బ్యాంక్‌లు వెనుకబడి ఉన్నందున త్వరితగతిన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంప్లాయిమెంట్ డెవలప్మెంట్‌పై యువతకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. బ్యాంక్ ఖాతాదారుల సౌలభ్యం కోసం మొండెంఖల్ వద్ద కొత్త బ్రాంచ్ ఏర్పాటుకు అధికారులు, ఆలోచనలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందించడం, లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని బ్యాంక్ అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్.విజరుస్వరూప్, డిసిసిబి బ్యాంక్ సిఇఒ సిహెచ్.ఉమామహేశ్వరరావు, జిల్లా సహకార శాఖ అధికారి పి.శ్రీరామ్మూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి తిరుపతయ్య, ఎఎల్‌డిఎం కె.మౌనిక, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## అరకులోయలో పర్యాటకుల సందడి

**అరకులోయ, విశ్వం వాయిస్ న్యూస్ :**
పర్యాటక కేంద్రమైన అరకు లోయలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మునుపెన్నడు లేని విధంగా గత నెల రోజులుగా పర్యాటకులు వేల సంఖ్యలో తరలి వస్తున్నారు. జనవరి మొదటి వారం నుంచి పర్యాటకుల సంఖ్య క్రమంగా తగ్గుతుందని అందరు భావించినప్పటికీ, ఇప్పటికి పర్యటకుల సంఖ్య ఏమాత్రం కూడా తగ్గుముఖం పట్టలేదు. ఆదివారం కూడా పర్యాటకులు తరలివచ్చారు.దీంతో అరకు ప్రాంతంలోని పర్యాటక సందర్శిత ప్రాంతాలు కిటకిట లడాయి. మరమ్మత్తుల దృష్ట్యా పద్మావతి ఉద్యాన కేంద్రం ఈనెల మూడు నుంచి 11 వరకు మూసి వేస్తున్నట్లు పాడేరు ఐటీడీఏ పీవో ప్రకటించినప్పటికీ, వందల సంఖ్యలో ప్రతిరోజు తరలివచ్చి నిరాశతో వెను తిరుగుతున్నారు. దీంతో అరకులో గిరిజన సంస్కతిక మ్యూజియం, కాఫీ మ్యూజియం చాక్లెట్ ఫ్యాక్టరీ కిటకిటలాడుతున్నాయి. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో గత నెల రోజుల నుంచి అరకు విశాఖ ఘాట్రోడ్లో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. పెరుగుతున్న పర్యాటకులతో ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్ దృష్ట్యా స్థానిక పోలీసులకు సవాలుగా మారింది. సిఐ, ఎస్సైల పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పర్యాటకులు, ప్రయాణికులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరగడం, ట్రాఫిక్ జాం ఘాట్రోడ్లో ఏర్పడుతున్న దృష్ట్యా ఇప్పటికే కాఫీ తోటలోని ఉడెన్ బ్రిడ్జి మూసివేసిన విషయం తెలిసిందే. సంక్రాంతి సెలవులు సమీపిస్తుండటంతో ఇంకా పర్యటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.
డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక ప్రదేశాలైన చాపరాయి జలపాతంలో సుమారు గత ఐదు, ఆరు వారాల బట్టి పర్యాటకుల తాకిడి తగ్గడం లేదు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వస్తుండడంతో పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. చాపరాయి జల పాతంలో సరదాగా జారుకుంటూ స్నానాలు చేస్తూ పర్యాటకులు ఆనందంగా గడిపారు. అరకు పినారిలోని అందమైన ఎత్తయిన చెట్ల మధ్యన ఫోటోలు తీయించుకుంటూ పర్యాటకులు సందడి చేశారు. గత మూడు రోజుల నుంచి ఈ పర్యాటక ప్రదేశాల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుండడంతో పర్యాటక ప్రదేశాలన్నీ పర్యాటక వాహనాలతో పర్యాటకుల సందడితో కిటకిటలా డుతున్నాయి. ఆదివారం చాపరై జలపాతం లో అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్డుకి ఇరువైపులా అడుగడుగునా వంటలు చేసి వన బోజనాలు చేస్తూ ఆటపాటలతో పర్యాటకులు సందడి చేశారు.




సినీ వాయిస్ CINEMA



## మత్తెక్కించే అందాలతో మాయ చేస్తున్న సాక్షి మాలిక్

మత్తెక్కించే అందాలతో మాయ చేస్తుంది సాక్షి మాలిక్. అందాల ప్రదర్శనలో ఈ బ్యూటీ చేస్తున్న రచ్చ అంతా ఇంతా కాదు. పరువాలన్నీ ప్రదర్శించేస్తూ చిత్తు చేస్తుంది. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి. రోజు రోజుకు గ్లామర్ డోస్ మరింత పెంచేస్తూ .. తన అందాలతో మాయ చేస్తుంది. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి. నటి సాక్షి మాలిక్ ఒక భారతీయ నటి, మోడల్ మరియు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్. ఆమె 1996 జనవరి 21న జన్మించింది. "సోను కే టిటు కి స్వీటీ" అనే బాలీవుడ్ చిత్రంలో నటించిన తర్వాత ఆమె బాగా ప్రాచుర్యం పొందింది. ఆ సినిమాలో ఆమె నటించిన 'బొమ్ డిగ్గీ డిగ్గీ' పాట యువతను విశేషంగా ఆకట్టుకుంది. సాక్షి మాలిక్ 1996 జనవరి 21న ఢిల్లీలో జన్మించింది. ఆమె ఢిల్లీలోని ఫ్రాంక్ ఆంథోనీ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేసింది. ఆ తర్వాత, జైపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నోయిడా నుండి ఇంజనీరింగ్‌లో పట్టా పొందింది.

## దబిడి దిబిడి ట్రోల్స్..



నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా ఈ నెల 12న సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతుంది. ఈ సినిమాను కె.ఎస్ బాబీ డైరెక్షన్‌లో తెరకెక్కించారు. థమన్ మ్యూజిక్ అందించిన ఈ సినిమాలో ప్రగ్యా జైశ్వాల్, శ్రద్ధ శ్రీనాథ్, ఊర్వశి రౌతెలా నటించారు. ఐతే ఈ ఈ సినిమా నుంచి టైటిల్ సాంగ్ తో పాటు చిట్టి సాంగ్ రిలీజైంది. ఆ రెండు సాంగ్స్ సూపర్ హిట్ కాగా థర్డ్ సాంగ్ గా దబిడి దిబిడి అంటూ రీసెంట్ గా ఒక సాంగ్ వదిలారు. ఈ సాంగ్ లో బాలకృష్ణ, ఊర్వశి రౌతెల స్టెప్పులు వేశారు. సాంగ్ కు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేయగా ఒక స్టెప్ పై సోషల్ మీడియాలో చాలా నెగిటివిటీ వచ్చింది. దబిడి దిబిడి సాంగ్ పై కొందరు వ్యతిరేకంగా కామెంట్స్ చేశారు. శేఖర్ మాస్టర్ స్టెప్పులతో పాటు హీరో, డైరెక్టర్ ఇలా అందరినీ టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేశారు. ఐతే దీనిపై నిర్మాత సూర్యదేవర నాగవంశీ స్పందించారు. దబిడి దిబిడి సాంగ్ కేవలం మాస్ ఆడియన్స్ కోసమే అని.. బాలయ్య మాస్ స్టెప్పులే తప్ప తనకు ఎక్కడా వల్గారిటీ కనిపించలేదని అన్నారు నాగవంశీ. థియేటర్‌లో ఈ సాంగ్‌ని బాగా ఎంజాయ్ చేస్తారని అన్నారు. సాంగ్ రిలీజ్ టైంలో కొంత నెగిటివిటీ వచ్చిన విషయం తెలుసు కానీ థియేటర్ లో ఈ సాంగ్ అందరికీ నచ్చుతుందని గట్టి నమ్మకంతో చెప్పారు నాగ వంశీ. సో దబిడి దిబిడి సాంగ్ పై నిర్మాత వెర్షన్ ఇది అన్నమాట. ఆల్రెడీ డాకు మహారాజ్ టైటిల్ సాంగ్ తోనే ట్రెండింగ్‌లో ఉన్న ఈ సినిమా దబిడి దిబిడి సాంగ్ ట్రోల్స్‌తో మరింత జనాల్లోకి వెళ్లింది.


## 'స్పైడర్‌మేన్' జంట జీవితంలో ముఖ్య ఘట్టం !

గాల్లో ఎగురుతూ సాహసాలు.. ప్రత్యర్థితో గగుర్పొడిచే యాక్షన్ విన్యాసాలు.. భవంతులపై నుంచి జంప్ లు.. స్పైడర్ మ్యాన్ తెరపై కనిపిస్తే చాలు ఉత్కంఠగా కళ్లప్పగించేస్తారు. అలాంటి గొప్ప వినోదాన్ని అందించిన పాత్రలో నటించాడు టామ్ హాలండ్. అతడికి ప్రపంచవ్యాప్తంగా స్కూల్, కాలేజ్ పిల్లల్లో భారీ ఫాలోవర్స్ ఉన్నారు. స్పైడర్ మేన్ సిరీస్ ని పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులు ఆదరించారు. భారత దేశంలోను ఈ సిరీస్ ఘనవిజయం సాధించింది. స్పైడర్ మేన్ టామ్ హాలండ్‌కు ప్రియురాలిగా ప్రముఖ నటి జెండయా నటించింది. తాజా సమాచారం మేరకు ఈ జంట పెళ్లి బంధంతో ఒకటి కానున్నారు. ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్నారు. టిఎంజెడ్ కథనం ప్రకారం స్పైడర్ మ్యాన్ తారలు ఇటీవల ఉంగరాలు మార్చుకున్నారు. అతిథులే లేకుండా సింపుల్ గా జరిగిన వేడుక ఇదని చెబుతున్నారు. దీనికి ఇద్దరు నటుల తరపునా కుటుంబ సభ్యులు కూడా హాజరు కాలేదు. కేవలం టామ్ & జెండయా మధ్య తీపి జ్ఞాపకంగా రింగ్స్ మార్చుకునే ప్రక్రియ పూర్తయిందని చెబుతున్నారు. ఇంతకుముందు 82వ గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల కార్యక్రమంలో జెండయా వేలికి పెద్ద డైమండ్ రింగ్ కనిపించడంతో దానిపై చాలా గుసగుసలు వినిపించాయి. రెడ్ కార్పెట్ షో సమయంలో లాస్ ఏంజిల్స్ టైమ్స్ రిపోర్టర్ జెండయాను రింగ్ గురించి అడిగినప్పుడు తను నేరుగా సమాధానం ఇవ్వలేదు. ముసిముసిగా, హాయిగా నవ్వేసుకుంది.



క్రీడా వాయిస్

## అతనికే మళ్లీ ముంబై ఇండియన్స్ పగ్గాలు !



అప్‌కమింగ్ ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబై ఇండియన్స్ సారథిగా మళ్లీ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యానే కొనసాగనున్నాడు. పేలవ ఫామ్‌తో పాటు టీమిండియా టీ20 సారథ్య బాధ్యతలు కోల్పోయి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న హార్దిక్ పాండ్యాకే జట్టు పగ్గాలు అందించేందుకు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాదే ప్లేయర్ ట్రాన్స్‌ఫర్ విండో ద్వారా గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌లోకి వచ్చిన హార్దిక్ పాండ్యా రోహిత్ శర్మ నుంచి సారథ్య బాధ్యతలు అందుకున్నాడు. అయితే ఈ నిర్ణయం ఆ జట్టు అభిమానులకు నచ్చలేదు. దాంతో మ్యాచ్‌ల సందర్భంగా హార్దిక్ పాండ్యాను తీవ్రంగా గేలి చేశారు. జట్టులోని ఆటగాళ్లు కూడా అతనికి సహకరించలేదనే వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే ముంబై ఇండియన్స్ గత సీజన్‌లో దారుణంగా విఫలమైంది. 14 మ్యాచ్‌లకు 4 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. ఈ పేలవ ప్రదర్శన నేపథ్యంలో హార్దిక్ పాండ్యాను జట్టు నుంచి తప్పిస్తారని ప్రచారం జరిగింది. మరోవైపు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాలు ముంబై ఇండియన్స్ జట్టు వీడుతాడని కథనాలు వచ్చాయి. కానీ ముంబై ఇండియన్స్ ఈ నలుగురు స్టార్ ఆటగాళ్లతో పాటు హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మను రిటైన్ చేసుకుంది. మెగా వేలంలో ఈ ఐదుగురు ఆటగాళ్లతో కూడిన కోర్ టీమ్‌కు తగ్గట్లు మిగతా ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆన్‌పేపర్‌పై ముంబై ఇండియన్స్ బలంగా కనిపిస్తోంది. ఐపీఎల్ 2024 సీజన్‌లో కెప్టెన్‌గా.. ఆటగాడిగా దారుణంగా విఫలమైన హార్దిక్ పాండ్యా.. టీ20 ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన చేశాడు. అటు బ్యాట్‌తో పాటు బంతితోను రాణించాడు.

## రోహిత్ శర్మ వైఫల్యం.. బీసీసీఐ కీలక నిర్ణయం !



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ భవితవ్యంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఆదివారం (జనవరి 12) జరగబోయే బీసీసీఐ కార్యవర్గ ప్రత్యేక సమావేశంలో హిట్‌మ్యాన్ భవితవ్యంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. ప్రస్తుతం రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో బ్యాటర్‌గా.. కెప్టెన్‌గా తీవ్రంగా నిరాశపరిచాడు. దాంతో ఈ సిరీస్‌ను టీమిండియా 1-3తో ఆసీస్‌కు కోల్పోయింది. పేలవ ఫామ్‌తో సిడ్నీ వేదికగా జరిగిన చివరి టెస్ట్‌కు రోహిత్ దూరంగా ఉన్నాడు. దాంతో అతను రిటైర్మెంట్ ప్రకటించేందుకు సిద్ధమైనట్లు వార్తలు వచ్చాయి. కానీ ఈ ప్రచారాన్ని రోహిత్ ఖండించాడు. తాను రిటైర్ అవ్వలేదని, జట్టు ప్రయోజనాల కోసం తుది జట్టు నుంచి తప్పుకున్నానని స్పష్టం చేశాడు.ప్రస్తుతం రిటైర్మెంట్‌పై ఆలోచన లేదన్నాడు. రోహిత్ క్లారిటీ ఇచ్చినా అతని భవితవ్యంపై సస్పెన్స్ కొనసాగుతోంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ వైఫల్యం నేపథ్యంలో బీసీసీఐ, సెలక్షన్ కమిటీ ఏ నిర్ణయం తీసుకుంటుందనేది హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 37 ఏళ్ల వయసున్న రోహిత్ శర్మ.. ఇంకెన్నాళ్లు క్రికెట్‌లో కొనసాగుతాడు? అనే ప్రశ్నగా మారింది. ఆస్ట్రేలియా పర్యటనలో రోహిత్ ఐదు ఇన్నింగ్స్‌లలో కేవలం 6.2 యావరేజ్‌తో 31 పరుగులు మాత్రమే చేయగలిగాడు రోహిత్. ఆస్ట్రేలియాలో అత్యల్ప పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా రోహిత్ శర్మ చెత్త రికార్డ్ నమోదు చేశాడు. అంతే కాకుండా సెప్టెంబరు 2024 నుంచి రోహిత్ ఆడిన.. చివరి ఎనిమిది టెస్టుల్లో కేవలం 164 పరుగులు మాత్రమే చేయగలిగాడు. వాటిలో ఒక అర్ధ సెంచరీ మాత్రమే ఉంది. బీసీసీఐ సెక్రటరీగా దేవజిత్ సైకియా, ట్రెజరర్‌గా ప్రభ్‌తేజ్ భాటియా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్తగా ఈ ఇద్దరూ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆదివారం బీసీసీఐ కార్యవర్గం ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ సమావేశంలో టీమిండియా టెస్ట్ ప్రదర్శనపై సమీక్ష జరపనున్నారు. అలాగే రోహిత్ శర్మ భవితవ్యంపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు. జట్టు ఎంపిక విషయంలో కఠినంగా ఉండాలని, సీనియర్ల విషయంలో రెండో ఆలోచన చేయాల్సిన అవసరం లేదని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను ఆదేశించినట్లు ఓ బీసీసీఐ అధికారి తెలిపాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఓటమితో టీమిండియా.. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. అప్‌కమింగ్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 జూలైలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌తో ప్రారంభం కానుంది. అప్పటి వరకు కుర్రాళ్లను రెడీ చేయాలని భారత సెలెక్టర్లు భావిస్తున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత రోహిత్ శర్మ కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## సౌతాఫ్రికా చేతిలో పాకిస్థాన్ క్లీన్ స్వీప్..!



సౌతాఫ్రికా పర్యటనను పాకిస్థాన్ ఘోర పరాజయంతో ముగించింది. రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా 10 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను సౌతాఫ్రికా 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. 58 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా 7.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 61 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. డేవిడ్ బెడింగ్‌హమ్(30 బంతు ల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 47 నాటౌట్) దూకుడుగా ఆడగా.. ఎయిడెన్ మార్క్‌రమ్(13 బంతుల్లో ఫోర్‌తో 14 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. అంతకుముందు 213/1 ఓవర్‌నైటక స్కోర్‌తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ 122.1 ఓవర్లలో 478 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షాన్ మసూద్(251 బంతుల్లో 17 ఫోర్లతో 145) సెంచరీతో రాణించగా.. మరో ఓపెనర్ బాబర్ ఆజామ్(124 బంతుల్లో 10 ఫోర్లతో 81) శతకాన్ని చేజార్చుకున్నాడు. మహమ్మద్ రిజ్వాన్(41), సల్మాన్ అఘా(48) హాఫ్ సెంచరీలు సాధించలేకపోయారు. సౌతాఫ్రికా బౌలర్లలో కగిసో రబడా, కేశవ్ మహరాజ్ మూడేసి వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. క్వెనా మఫకాకు ఓ వికెట్ దక్కింది.

విశ్వంవాయిస్ తెలుగుదినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైం వాయిస్
- కెరీర్ వాయిస్
- క్రీడావాయిస్
- హెల్త్ వాయిస్
- కిడ్స్ వాయిస్
- కిసాన్ వాయిస్
- సక్సెస్ వాయిస్
- తీర్పు వాయిస్
- వనిత వాయిస్
- విద్యా వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by **KHANDAVELLI SUNIL KUMAR,** H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: **KHANDAVELLI SUNIL KUMAR.** RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com